ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



వార్త

శనివారం 06, ఆగస్టు 2022 16 పేజీలు

వీరులారా..

# వందనం

- సంస్మరణ సభకు భారీగా ఆదివాసీలు
- 2వేల మంది హాజరైనట్లు సమాచారం
- జోష్‌లో మావోయిస్టులు..
- షాక్‌లో పోలీసు వర్గాలు

అడవంతా జనం.. ఏనోట విన్నా అమర్‌రహే అన్న నినాదంతో దండకారణ్యం దద్దరిల్లింది... మునుపెన్నడూ లేని విధంగా ఊరూరా కదలివచ్చిన ఆదివాసీలు మావోయిస్టుల అడుగుజాడలలో అడుగేసి ఆటపాటలలో అలరించారు. దట్టమైన అడవిలో పచ్చని చెట్ల మధ్య నిలువెత్తు స్థూపం సాక్షిగా మావోయిస్టుల అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేశారు.

ప్రభాతవార్త, చర్ల



2 లో..



# స్నానమెలా స్వామీ

- శ్రావణ స్నానాలకు నోచుకోని భక్తులు..
- కన్నెత్తి చూడని అధికారులు
- వరదల బురదలోనే స్నానాల రేవు

ప్రభాతవార్త ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం.

ఇటీవల గోదావరి ఉగ్ర రూపం దాల్చి అనేక పొలాల్లో, ఇండ్లల్లో, రహదారుల్లో, ఇసుక మేటలు, ఒండ్రు బురద మేటలుగా వేసింది. గోదావరి శాంతించిన అనంతరం ఎక్కడ చూసినా గోదావరి ఒండ్రు బురదతో

2లో...



వ్యాధుల కాలం..

# జర భద్రం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- మంచం పడుతున్న మన్యం ప్రజలు
- భయాందోళన కలిగిస్తున్న 'మంకీపాక్స్'
- జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు

భద్రాద్రి కొత్తగూడెం, ప్రభాతవార్త

పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వ్యాధుల కాలం.. ఆపై వర్షాలు.. దీంతో మన్యం ప్రజలు మరింతగా బాధపడుతున్నారు. గత 20 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఇళ్లల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది.

2 లో..



2లో...

మణుగూరులో మంకీఫాక్స్ కలకలం

# మోడీ పాలనతో వ్యవసాయ సంక్షోభం

- అమలు కాని స్వామినాథన్ సిఫారసులు
- బోడేపూడి ఆశయాలు కొనసాగించాలి
- బివికే ట్రస్ట్ చైర్మన్ తమ్మినేని



16వ పేజీలో...



# వీరులారా.. వందనం

**(మొదటి పేజీ తరువాయి..)**

మావోయిస్టు ఉద్యమంలో అమరులైన వీరులకు నివాళ్ళు అర్పిస్తు ప్రతి ఏడాది మావోయిస్టు అమర వీరుల సంస్మరణ సభలు వారంరోజుల పాటు నిర్వహిస్తారు. గతనెల జులై 28 నుండి ఆగస్టు 3 వరకు సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని మావోలు పిలుపునిచ్చారు. మావోయిస్టు ఉద్యమ నిర్మాతలైన కామ్రేడ్ చారుమజుందార్, కామ్రేడ్ కన్హాయ్‌ఛటర్జీల జ్ఞాపకార్థం ఈ వారోత్సవాలు నిర్వహించటం పరిపాటే కాగా ఈ దఫా సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరపాలని ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగారు. వారోత్సవాలకు పదిరోజుల ముందునుండే విస్తృత ప్రచారం నిర్వహించారు. సభలను విజయవంతం చేసేందుకు దండకారణ్యంలోని మావోలకు పెట్టని కోటలా ఉన్న ప్రాంతాన్ని ఎంచుకొని నిలువెత్తు స్తూపాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాలతో పాటు దండకారణ్యంలోని ఆదివాసీలను పెద్దఎత్తున సభకు తరలించారు. వందలాది మంది పాల్గొన్న అమరవీరుల సభలోమావోయిస్టు అగ్రనేతలు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. మావోయిస్టు ఉద్యమం ఎలా పుట్టింది ఎంతో మంది ఉద్యమంలో తమ కుటుంబాలను వదిలి ఎందుకు పాల్గొన్నారు. మావోయిస్టు పీడిత ప్రజల పక్షాన పోరాడే ఉద్యమ పార్టీ ఉద్యమంలో జరిగిన లోటుపాట్లు ప్రభుత్వాలు మావోయిస్టు ఉద్యమాన్ని ఎందుకు అణిచివేయాలని చూస్తుంది భవిష్యత్తులో ఉద్యమం ఎలా ఉండబోతోంది అనే అంశాలతో పాటు పీడిత ప్రజలు ఉద్యమంలోకి రావాల్సిన ఆవశ్యకత గురించి అగ్రనేతలు సభలో పాల్గొన్న మావోయిస్టు సానుభూతి పరులకు, ప్రజలకు వివరించినట్లు తెలిసింది. వారోత్సవాల ముగింపు సభకు ఏరియా కమిటీల వారీగా సభలు, సమావేశాలు నిర్వహించి పెద్దఎత్తున జన సమీకరణ చేసినట్లు వినికిడి. దండకారణ్యంలో భారీ జనసందోహం నడుమ మావోయిస్టు సంస్మరణ వారోత్సవాలు విజయవంతం కావడంతో మావోలు మంచి జోష్ మీద ఉన్నట్లు తెలుస్తుంది. సంస్మరణ సభలను విజయవంతం చేయ్యడంతో పాటు అట్టి వీడియోలను, ఫొటోలను మీడియాకు సైతం విడుదల చేశారు. వారంరోజుల పాటు జరిగిన వారోత్సవాలను ఎటువంటి అలజడులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టిన పోలీసులు మావోలు తాజాగా విడుదల చేసిన వీడియోలు ఫొటోలతో పోలీస్‌లో కొంత ఆందోళన మొదలైంది. అటవీ ప్రాంత ప్రజలను బలవంతంగా సభలకు తరలిస్తున్నారని పోలీసులు చెప్పున్నారు. సభలకు రాని వారికి మూడువేల రూపాయల ఫైన్ వేస్తున్నట్లు మీడియాకు తెలిపిన పోలీస్ ఉన్నతాధికారులు మావోయిస్టులు చేసే సంఘ విద్రోహ చర్యలలో పాలు పంచుకోవద్దని హితవు పలికారు. అయినా సభల విజయవంతం అయిన జోష్‌లో మావోయిస్టులు ఉండగా వారోత్సవాలలో ఏఏ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు, వారికి ఎవరు సహకరించారు అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం ఉన్నట్లు అటు మావోయిస్టులు ఇటు పోలీసుల మధ్య ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి నెలకొనడంతో ఎప్పుడు ఏం జరుగుతుందా అనే ఆందోళన అటవీప్రాంత గ్రామాల ప్రజల్లో నెలకొంది.

# స్నానమెలా స్వామీ

**(మొదటి పేజీ తరువాయి..)**

ఒళ్ళు గగుర్ పొడిచే విధంగా పరిస్థితి ఏర్పడింది. అయితే గోదావరి సాధారణ స్థాయికి చేరి వారం రోజులు కావస్తున్నా.. దక్షిణ అయోధ్యగా భావించి శ్రీసీతారామచంద్రస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు గోదావరిపుణ్యస్నానం ఆచరించి శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుంటారు. నిత్యం వందలాది మంది గోదావరి పుణ్యస్నానం ఆచరించడానికి స్నానాల రేవుకు చేరుకుంటారు.కానీ నేటికి గోదావరి స్నానాల రేవు వద్ద బురద పేరుకుపోయి స్నానం చేయడానికి వెళ్ళాలంటే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు గత రెండు రోజుల వరకు అటు వైపుకు తలెత్తి చూసిన దాఖలాలు లేవు. ఎట్టకేలకు గురువారం నుండి మెట్ల మార్గాలను శుద్ధి చేయడం ప్రారంభించినా ఆ పనులు నామమాత్రంగానే జరుగుతున్నాయి. ఇటు పంచాయతీ అధికారులు .. అటు ఇరిగేషన్ అధికారులు కానీ, పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయి. గోదావరి స్నానం చేయడానికి వచ్చే భక్తులు గోదావరి నదిలోపలికి దిగి స్నానం ఆచరించే పరిస్థితి లేక మనిషికి మనిషి తోడుగా పట్టుకుని నెమ్మదిగా గోదావరి నది ఒడ్డుకు చేరి నీళ్ళు తలపై చల్లుకుని అసంతృప్తితో వెనుతిరుగుతున్నారు. అంతేకాకుండా స్నానాల రేవు ప్రాంతంలో వెలసి ఉన్న ఆలయాలు పూర్తిగా బురదతో నిండి పోయాయి. ఇంత దారుణమైన పరిస్థితిలో ఉన్న గోదావరి స్నానాల రేవును ఎప్పటికి శుద్ధి చేసి రామభక్తులకు పుణ్యస్నానం ఆచరించే అవకాశం కల్పిస్తారని రామభక్తులు, మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**శ్రావణ శుక్రవారం రోజు గోదావరి పుణ్యస్నానానికి దూరమైన భక్తులు**

నిత్యం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులతో పాటు భద్రాచలం పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రజలు పవిత్రమైన పండుగ రోజుల్లో గోదావరి పుణ్యస్నానం ఆచరించి స్వామి వారిని దర్శించుకుని వ్రతాలు నోచుకుంటారు. శ్రావణ శుక్రవారం నాడు మహిళలు అధిక సంఖ్యలో తెల్లవారుజాము నుండి గోదావరి నదీ స్నానం ఆచరించి శ్రీలక్ష్మీదేవి వ్రతం ఆచరిస్తారు. ఈ సంవత్సరం గోదావరి నది ఒడ్డున బురద పేరుకుపోవడంతో భక్తులు గోదావరిలో స్నానం చేసే అవకాశం లేక తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ పరిస్థితులపై దృష్టి కేంద్రీకరించి యుద్ధ ప్రాతిపదికన స్నానాల రేవులో మెట్లపైన, సమీప దేవాలయాల్లోను పేరుకుపోయిన బురదను తక్షణమే తొలగించి భక్తుల యొక్క మనోభావాలను కాపాడాలని మహిళా సంఘాలు కోరుతున్నవి.

# మణుగూరులో మంకీఫాక్స్ కలకలం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు05:**

నిన్న, మొన్నటివరకు కరోనా మహమ్మారితో ప్రపంచం మొత్తం గడగడలాడగా.. తాజాగా మంకీఫాక్స్ అనే కొత్తవైరస్ అదేస్థాయిలో ప్రపంచాన్ని వణికిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతమైన పినపాక ఏజెన్సీ కూడా ఇదే తరహా లక్షణాలున్న వ్యక్తి ఆస్పత్రికి రావడంతో మంకీఫాక్స్ కలకలం మణుగూరు ప్రజల్లో కొత్తగుబులు రేపింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ఓ వ్యక్తి తన స్వగ్రామమైన మణుగూరు మండలంలోని ఓ గ్రామానికి చేరుకోగా.. శుక్రవారం అతని శరీరంపై దద్దుర్లు తేలడంతో మణుగూరు వందపడకల ఆస్పత్రికి చేరుకున్నాడు. అతన్ని పరీక్షించి లక్షణాలను గమనించిన వైద్యులు మంకీఫాక్స్ లక్షణాలు అనే అనుమానంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రికి వెళ్లవలసిందిగా సూచించారు. దీంతో అతను కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రికి వెళ్లగా.. అతనిని పరీక్షించిన వైద్యులు రోగ నిర్ధారణ కోసం రక్తనమూనాలు సేకరించారు. ఇందులో భాగంగానే కోవిడ్‌ను నిర్ధారించే ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు కూడా నిర్వహించారు. రోగి వద్ద సేకరించిన నమూనాలను హైద్రాబాద్ ల్యాబ్‌కు పంపించామని, పూర్తిస్థాయి నివేధిక వచ్చేవరకు మంకీఫాక్స్‌గా నిర్ధారించలేమని వారు పేర్కొన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. అతనికి మంకీఫాక్స్ సోకలేదని నీటి మార్పువల్ల ఎలర్జీతో శరీరంపై దద్దుర్లు వచ్చాయని మంకీఫాక్స్ సోకినట్లుగా ఎటువంటి తప్పుడు ప్రచారం చేయవద్దని వేడుకుంటూ సదరు వ్యక్తి సోషల్‌మీడియాలో పోస్టు పెట్టాడు. ఈ విషయమై ప్రభాతవార్త డీఎంహెచ్‌వోను సంప్రదించగా.. అతనికి మంకీఫాక్స్ లక్షణాలు ఏమీ లేవని, అతన్ని పరీక్షించి పంపినట్లు ఆయన తెలిపారు.

# మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది

**మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

**ప్రభాతవార్త ఖమ్మం ఆగస్టు 5**

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ 20వ డివిజన్ కృష్ణానగర్ నందు మంత్రి, జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్, నగర మేయర్ పునుకొల్లునీరజలతో కలిసి పర్యటించి పలు ఇళ్లలోకి వెళ్లి సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆయా గృహాల్లోని కుండీలు, గాబులు, డ్రమ్ములు, నీటితొట్టి, మేడమీద ఉన్న కూరగాయల పాదులను పరిశీలించి ప్లాస్టిక్ సామాగ్రిని తనిఖీ చేసి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నిల్వ నీటిలో డెంగ్యూ దోమలు వృద్ధి చెందుతాయని అవగాహన కల్పించారు. గృహ యజమానులతో కలిసి పలు కుండీలలో నీరు తొలగించి శుభ్రం చేశారు. ఇళ్ల మధ్య గల ఖాళీ స్థలాల్లో మురుగునీరు, వర్షంనీరు చేరడంతో ఆయా స్థల యజమానులకు సమాచారం ఇచ్చి ఆయా స్థలం బాగుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మురుగు కాల్వలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కాలంలో విష జ్వరాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని ముఖ్యంగా ముందు దోమలబెడద లేకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు. ఇళ్లలో నుంచి ఉత్పన్నమయ్యే చెత్తతోనే దోమలు వస్తాయని, నీరు నిల్వ ఉండటం వల్ల దోమలను మనమే పెంచి పోషించి విషజ్వరాలకు కారణమవుతున్నామని న్నారు. విషజ్వరాలు ఆగస్ట్ నెలలో అత్యంత వేగంగా ప్రబలే ప్రమాదం ఉందని, వైద్య సిబ్బంది, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ మండల గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి పువ్వాడ అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలని, విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా అంగనావడీ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కరోనా వ్యాక్సిన్ రెండుడోసులు తీసుకున్నవారు ఆరునెలలు దాటినట్లయితే బూస్టర్ డోస్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, సుడా ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటరుల కమర్తపుమురళి, ప్రశాంతి లక్ష్మీ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మల్లీశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్యాధికారిని డాక్టర్ మాలతి, జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ సంధ్య, వైద్యాధికారి, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధుల కాలం.. జర భద్రం..

**(మొదటి పేజీ తరువాయి..)**

వరద వచ్చి మొత్తం బురద తెచ్చిపెట్టడంతో ముంపు ప్రాంతాల ప్రజలు మరింతగా ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాను విషజ్వరాలు వణికి స్తున్నాయి. మణుగూరు మండలంలోని మన్యం ప్రజలు మంచం పట్టారు. వైరల్ ఫీవర్, సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరుతున్న జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మరోవైపు కొత్తగా మంకీఫాక్స్ కలకలం రేపుతోంది. నిన్నమొన్నటి వరకు కరోనాతో భయాందోళన చెందిన ప్రజలకు తాజాగా మంకీఫాక్స్ మరింత దఢ పుట్టిస్తోంది.

జిల్లాలోని మన్యం ప్రజలు మంచమెక్కారు. విషజ్వరాలు, వైరల్ ఫీవర్‌లు, సీజనల్ వ్యాధుకు గురై ఆస్పత్రుల్లో క్యూ కడుతున్నారు. గిరిజన గ్రామాల్లో సరైన సర్కారీ వైద్యం అందని ప్రజలు పట్టణ ప్రాంతాలకు వరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో పూర్తిస్థాయి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఏజెన్సీ వాసులు వాపోతు న్నారు. దీనికితోడు ఇటీవలే గోదావరి నది ఉగ్రరూ పంతో సంభవించిన వరదలతో అతలాకుతలమైన ప్రజలు అంటువ్యాధుల ముంపున పడుతున్నారు.

**– సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి**

వర్షాకాలంలో వచ్చే వ్యాధులు రెండు రకాలుగా ఉంటాయి. ముఖ్యంగా నీటి కాలుష్యం వల్ల, దోమల వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని మొదట్లోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకొని ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కలుషితమైన నీటిని తాగడం వల్ల కలరా, నీళ్ల విరేచనాలు, కామెర్లు లాంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. వీటన్నింటికీ వివిధ రకాలైన మలి నాలు వరద నీటితో కొట్టుకొచ్చి నీటి వనరులతో కల వడం ప్రధానమైన కారణం. దీంతోపాటు ఈ మధ్య మినరల్ వాటర్‌లో కూడా కలుషితం అయ్యే అవకాశం ఉంది. మలినమైన నీరు, మనం సేకరించే కూరగా యలు, పండ్లను కలుషితం చేస్తాయి. ఈగలు కూడా ఎక్కువగా ఆహారాన్ని కలుషి చేస్తుంటాయి. మంచి నీటి తో పాటు ఆర్‌వో వాటర్ ను కూడాబాగా కాచి చలా ర్చిన తరువాతనే తాగాలి. ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కూర గా యలు, పండ్లను వేడినీటితో కడిగి వాటిపై జాలితో త యారు చేసిన మూతలు పెట్టాలి. మంచినీటి బిందె లు, కుండలలో చేతులు ముంచకుండా కాడ గ్లాసులను ఉప యోగించాలి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోవద్దు.

**– సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణం దోమలే...**

దోమల వల్ల డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వస్తాయి. అనాఫిలెస్ జాతికి చెందిన దోమ వల్ల మలేరియా జ్వరంతో ఉన్న రోగిని కుట్టి అదే దోమ ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుట్టినప్పుడు అతనికి కూడా మలేరియా వ్యాపిస్తుంది. చలిజ్వరం, జ్వరం తగ్గిన వెంటనే చెమటలు పట్టడం, వాంతులు, ఒళ్లు నొప్పులు, రక్తహీనత, మూత్రపిండాలు చెడిపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగ్యూ జ్వరం చికెన్‌గున్యా కంటే ఎక్కువగా ఇంట్లో శక్తిని హరిస్తుంది. పగటిపూట మాత్రమే ఈ దోమ కుడుతుంది. తీవ్ర జ్వరం, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్త స్రావం జరుగుతుంది. కండరాలు, కీళ్లనొప్పులు ఎక్కువగా వస్తాయి. ఇంటి పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

**– భయాందోళన కలిగిస్తున్న 'మంకీపాక్స్'**

కరోనా నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని అనుకుంటున్న ప్రజలకు మరింత భయాందోళన కలిగిస్తుంది మంకీపాక్స్... ఇది ఇంకా మన దేశంలోకి రాలేదని ధీమాగా ఉన్న వారందరికీ ఇప్పుడు తాజాగా వస్తున్న వార్తలు విని భయాందోళన చెందుతు న్నారు. మంకీపాక్స్ ఇప్పుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశించిందనే వార్త దావానంలా వ్యాపించకుండా జిల్లా ప్రజలు ఒక్కసారి షాక్‌కు గురయ్యారు. అయితే అనుమానిత కేసుగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంకీపాక్స్ ఇంకా మన జిల్లాకు రాలేదని అధికారులు ధైర్యమిస్తున్నారు. ఈ వ్యాధి గురించి తెలిసిన వారంతా మరింత జాగ్రత్త పడుతున్నారు.

**– దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం : డీఎంహెచ్‌వో దయానందస్వామి**

వర్షాకాలంలో నీటికి ఆధారంగా పుట్టేవి దోమలు. కొన్ని దోమలు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా వ్యాధులకు కారకాలవుతాయి. నిల్వ ఉన్న నీటిలో లార్వాలు పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. 297 సమస్యాత్మక గ్రామాల ను గుర్తించి ఏజెన్సీలో దోమతెరలతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అర్బన్ ఏరియాల్లో ఉన్న దోమలు మాత్రం చాలా పెద్దగా ఉంటాయి. వాటి నియంత్రణ కోసం కూడా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ఒక్కరూ డ్రైడే తప్పక పాటించాలి. దోమ 28 రోజులు మాత్రమే బ్రతుకుతుంది. వారం రోజుల్లోనే అవి గుడ్లు పెడతాయి. అలా జరగకుండా ఉండేందుకు అందరూ నిల్వ ఉన్న నీటిని పారబోస్తే దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయి. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 41 వేలు, మత్స్యశాఖ ద్వారా గంబూషియా 60 నుంచి 70 వేల వరకు గంబూషియా చేపలను వదులు తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో టీములను ఏర్పాటు చేశాం. ప్రతీ రోజు వారు గ్రామాల్లో పర్యటించి జ్వర పీడితులను పరిశీలించి రక్తనమూనాలు సేకరించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణ పట్ల శ్రద్ధ చూపుతున్నారు.

## ఎమ్మెల్యేకు వివాహ పత్రికను అందించిన మంత్రి పువ్వాడ

*ఇల్లెందు, ప్రభాతవార్త :*

రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తన కుమారుడు నయన్‌రాజ్ వివాహ పత్రికను శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కుమారుని వివాహానికి హాజరు కావాలంటూ ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దిండిగాల రాజేందర్, ఇల్లెందు మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావులతో పాటు పలువురు టీఆర్ఎస్ నాయకులకు, స్థానిక జర్నలిస్టులకు కూడా వివాహ ఆహ్వాన పత్రికను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్, పులిగండ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



## ఇల్లెందులో కాంగ్రెస్ నాయకుల ధర్నా

*ఇల్లెందు, ప్రభాతవార్త :*

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లెందు పట్టణంలోని బుగ్గవాగు వంతెనపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ముందుగా పట్టణంలో భారీ ప్రదర్శన చేశారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపుతో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో ఇల్లెందు పట్టణానికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయం వరకు పెద్ద ప్రదర్శన నిర్వహించి తహసిల్దార్ కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు లక్కినేని సురేందర్‌రావు, భుక్యా ధళిసింగ్‌నాయక్, కిసాన్ కాంగ్రెస్ నాయకులు ఏలూరి కోటేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, బానోత్ వెంకటప్రవీణ్, ఇల్లెందు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పులి సైదులు, ఇల్లెందు పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియేల్, టేకులపల్లి మండల అధ్యక్షులు గుండా నరసింహారావు, బయ్యారం మండల అధ్యక్షులు ముసలయ్య, కామేపల్లి మండల అధ్యక్షులు నర్సి రెడ్డి, నాయకులు బానోత్ సాములు, జాఫర్, లక్ష్మణ్, రవి, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

*టేకులపల్లి, ప్రభాతవార్త:*




మండల కేంద్రంలోని పి ఎం హెచ్ బాలుర హాస్టర్ నందు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మువద మహాసభల పోస్టర్‌ను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరిష్‌గౌడ్, ఆ సంఘం మాజీ జిల్లా నాయకులు గుగులోత్ రాంచందర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1979 తర్వాత సుమారు 40 సంవత్సరాల తర్వాత తిరిగి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేదికగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేశారన్నారు. ఈ మహాసభలను విద్యార్థులు, మేధావులు, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ జిల్లా నాయకులు కర్లపూడి సురేందర్‌పాల్, శ్రీరాములు, మండల నాయకులు కెలోత్ నితిన్, బానోత్ యుగేందర్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి కోటి కుంకుమ అర్చన

### -చిన్న అరుణాచల క్షేత్రంలో వరలక్ష్మి వ్రత పూజలు

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త:*

శ్రావణమాసం వరలక్ష్మి వ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో వెలసి ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్న అరుణాచలం దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం కోటి కుంకుమార్చన కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వరలక్ష్మి వ్రత మహత్యాన్ని భక్తులకు శివనాగస్వామి వివరించారు. ఆలయం తరుపున భక్తులందరికి పసుపు, కుంకుమలతో పాటు జాకెట్ ముక్కలు, గాజులను వాయనంగా అందించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు ఈ గోటి కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## బోడేపూడి 25వ వర్ధంతి సందర్భంగా ఘననివాళి

*భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :*

భద్రాచలం పట్టణంలో బండారు చంద్రరావు భవన్‌లో శుక్రవారం సీపీయం పట్టణ కార్యదర్శి గద్దం స్వామి అధ్యక్షతన మధిర మాజీ శాసనసభ్యులు అమరజీవి కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు 25వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా బోడేపూడి చిత్రపటానికి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ .. నిరంతరం ప్రజలను అంటిపెట్టుకుని ప్రజా ఉద్యమాలు నిర్వహించారని, అన్ని వేళలా పార్టీ కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో సీపీయం నాయకులపై దాడులు జరిగిన సందర్భంలో కేడర్‌కు మనోధైర్యం కల్పించే దానిలో ముందున్నారని అన్నారు. బోడేపూడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏ.జె. రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మా చారి, ఎం.బి.నర్సా రెడ్డి, కారం పుల్లయ్య, జ్యోతి, బాల రాజు, పట్టణ నాయ కులు ఎం.వి.ఎస్. నారాయణ, కాంపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.







## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే

*ఇల్లెందు, ప్రభాతవార్త :*



ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వినీత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకెను అందించారు.

## సైబర్ నేరస్థులపై టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు

*టేకులపల్లి, ప్రభాతవార్త :*




టేకులపల్లి మండలం గోలియాతండా పంచాయతీకి చెందిన బానోత్ కుమార్ అనే వ్యక్తికి సైబర్ నేరస్థులు ఫోన్ చేసి వొడా, ఐడియా, వీఐ టవర్‌ను భూమిలో నిర్మిస్తామని, భూమి సర్వేనెంబర్ ఇవ్వాలని కోరారు. సర్వే నంబర్ చెప్పితే శాట్‌లైట్ ద్వారా భూమిని తమ కంపెనీ ఓకే చేసిందని, అడ్వాన్సుగా రూ.20 లక్షలు, భూమి కౌలు రూ.25 వేలు ఇస్తుందని, కంపెనీలో ఉద్యోగం ఇచ్చి నెలకు రూ.15 వేల వేతనం ఇస్తామని తెలిపారు. ముందుగా రూ.10 వేలు ఫోన్‌పే తమ కంపెనీకి చేస్తే వెంటనే పని పూర్తి చేస్తామని గత మూడు రోజులుగా ఫోన్ చేస్తుండటంతో అనుమానం వచ్చిన కుమార్ స్థానిక సర్పంచి బోడ నిరోషా మంగిలాల్‌కు తెలిపారు. ఆమె ఐడీయా టవర్ వారికి ఫోన్ చేస్తే మాకు ఎటువంటి సంబంధం లేదని, ఫోన్ చేసిన వారు సైబర్ నేరస్థులని తెలపడంతో సర్పంచి భర్త మంగిలాల్‌తో కలిసి కుమార్ టేకులపల్లి సీఐ ఎ.వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. సీఐ కుమార్‌కు వచ్చిన ఫోన్ నెంబర్‌ను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే ఎలాంటి అడ్రస్ చూపించడం లేదని తేలింది. దీనితో ఇలాంటి కాల్స్ వస్తే ఎవరూ ఎటువంటి సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించ వద్దని సీఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలీసులు ఇప్పటికే సైబర్ నేరాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుండటంతో గుర్తించిన కుమార్ ఆలోచించి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

## నిత్యావసరాలు పంపిణీ

*భద్రాచలంఅర్బన్, ప్రభాతవార్త :*



తాళ్ళూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ మరియు డిస్ట్రిక్ట్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్, తానా, సుగంధ ఫౌండేషన్ వారి సహాయ సహకారాలతో బండారు చంద్రరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలోని రామాలయం గుడి వద్ద విస్తా కాంప్లెక్స్ చిరు వ్యాపారులు 100 కుటుంబాలకు నిత్యావసరాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని తాళ్ళూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత తాళ్ళూరి పంచాక్షరయ్య, సీపీయం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ చావా లక్ష్మీనారాయణ, ఎల్ అండ్ బి సూర్యనారాయణ, పల్లింటి దేశప్ప, బండారు చంద్రరావు ట్రస్ట్ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఎం.బి.నర్సా రెడ్డి, గద్దం స్వామి, ఎం.రేణుక, సున్నం గంగా, నాదెళ్ళ లీలావతి, ఎస్.రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.




## విఆర్ఏల దీక్షకు మద్దతు తెలిపిన సీపీఐ

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :



బూర్గంపహాడ్ మండల కేంద్రంలో విఆర్ఏలు గత 12 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సీపీఐ మండల సమితి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ముప్వా వెంకటేశ్వర్లు (లడ్డ) మాట్లాడుతూ .. అసెంబ్లీ సాక్షిగా విఆర్ఏలకు పే స్కేల్ జీవో ఇస్తానని ముఖ్యమంత్రి కేసిఆర్ మోసం చేసాడని అన్నారు. మోసాలు ఎప్పుడు నడవవని కొన్ని రోజులు మాత్రమే నడుస్తాయని అన్నారు. ప్రజలు సమయాన్ని బట్టి తగిన బుద్ధి చెపుతారని అన్నారు. అతి కోర్కెలు మీము కోరటం లేదని, అధికార పార్టీ ఎన్నికల మేనిపెస్టోను మాత్రమే అమలు చేయమని కోరుతున్నామని అన్నారు. విఆర్ఏల సమస్యలతో పాటు మండలంలో ప్రధాన సమస్యలను గుర్తిస్తున్నామని, త్వరలో కార్యక్రమాల షెడ్యూల్ ప్రకటిస్తామని అన్నారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీను, మండల సహాయ కార్యదర్శి పాండవుల భిక్షం, బూర్గంపహాడ్ పట్టణ కార్యదర్శి ముదిగొండ బాలకృష్ణ, దాసరి మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ అడ్మిషన్స్ తేదీ పొడిగింపు

భద్రాచలం, ప్రభాతవార్త ::

ప్రభుత్వ మరియు ప్రైవేటు ఐటిఐలలో 2022 -2023 విద్యాసంవత్సరమునకు గాను ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ధరఖాస్తు చేసుకొనుటకు గడువు 10.08.2022 వరకు పొడిగించబడినదని ప్రభుత్వ ఆశ్రమ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మణ్ తెలియజేశారు. ఆర్ఐటీఐ, కృష్ణసాగర్‌లో ఎలక్ట్రీషియన్ -20, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్ -24, కోప -48 సీట్లు ఉన్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మణ్ తెలియజేశారు. అభ్యర్థులు ఐటిఐ.తెలంగాణ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్ నందు ధృవీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసుకోవాలని, అభ్యర్థులు 10వ తరగతి పాస్తై 01.08.2022 నాటికి 14 సంవత్సరాలు నిండి ఉండాలని అన్నారు.

## కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి : కాంగ్రెస్

చర్ల, ప్రభాతవార్త :

టీపీసీసీ పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదేశాల మేరకు చర్ల మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చర్ల అంబేద్కర్ సెంటర్ నందు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ మెంబర్ నల్లపు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ .. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి వాటిపై అధికారి జీఎస్టీ వసూలు ఏయడం వలన ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని, ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని మాని ప్రజలపై భారం తగ్గించాలని ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. విజయ్‌నాయుడు, మండల అద్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ కోదండ రామయ్య, ఎంపీటీసీ మడకం పద్మ ఆవుల సుబ్బారావు, భాస్కరరావు, భద్రం, గూడపాటి సతీష్, అలవాల బాలు, శ్యామల సీత, టిఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ సాయిల్ రమేష్, ముత్యాల ప్రసాద్, సత్తిబాబు, మేడి రమేష్, యాలం రమేష్, చింతూరు రజినికాంత్ జోగారావు, సాగర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి విడనాడాలి

**-పెంచిన నిత్యావసరాల ధరలు తగ్గించాలి**

**-డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య**

భద్రాచలం, ప్రభాతవార్త :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ల ధరలు తగ్గించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరికి నిరసనగా శుక్రవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సరేళ్ళ నరేష్ ఆధ్వర్యంలో భద్రాచలం - చర్ల ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పీసీసీ ఉపాధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మరియు భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య మాట్లాడుతూ .. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు పేదలను పాతాళానికి తొక్కే విధంగా నిత్యావసర ధరలను, పెట్రోల్, డీజిల్,





వంటగ్యాస్, కరెంటు, ఆర్టీసీ చార్జీలను రోజురోజుకు పెంచుకుంటూ పోతూ పేదలపై పెను భారాన్ని మోపుతున్నారని, బంగారం కంటే అధికంగా నిత్యావసరాలపై జీఎస్టీని విధిస్తున్నారని కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసేందుకే ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చేపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ బోగాల శ్రీనివాసరెడ్డి, దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు లంకా శ్రీనివాస్, సంగీతరావు, దర్శి సాంబశివరావు, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చింతిరేలా సుధీర్, ఎడారి ప్రదీప్, సరెళ్ళ వెంకటేష్, రాచమళ్ళ రాము, రాగం సుధాకర్, మాగాపు రాజు, నిట్ట రాజు, కొత్త మహేష్, ఉబ్బ వేణు, తెల్లం నరేష్, బుడగం శ్రీనివాస్, పులిదింటి సాగర్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు వసంతాల రాజేశ్వరి, సరిత, తుమ్మల రాణి, పిలక వెంకటరమణారెడ్డి, తోకల ప్రసాద్, కోట రవి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**-ఐటిడిఏ ఏపీవో డేవిడ్‌రాజ్**

భద్రాచలం, ప్రభాతవార్త :

ఈ నెల 15వ తారీఖు నాడు జరిగే 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను చాలా ఘనంగా నిర్వహించాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో వివిధ యూనిట్ అధికారులతో 75 స్వతంత్ర్య దినోత్సవ వేడుకలపై చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. 75వ స్వతంత్ర్య దినోత్సవం వజ్రోత్సవం సంబంధించిన వేడుకలపై ఏఏ శాఖ అధికారులకు అప్పగించిన పనులను వారు ఇప్పటి నుండి ప్రణాళికల రూపొందించుకుని తప్పనిసరిగా వచ్చే వజ్రోత్సవ వేడుకలను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. ఏర్పాట్ల విషయంలో ఆ జాగ్రత్త పనికిరాదని, తప్పనిసరిగా మీకు అప్పగించిన పనిని పూర్తిస్థాయిలో వినియోగించుకొని వజ్రోత్సవ వేడుకలు విజయవంతం అయ్యే విధంగా తోడ్పాటు అందించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలన అధికారి భీం, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని రమాదేవీ, డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏసీఎంవో రమణయ్య, స్కాట్ ఇంచార్జ్ చలపతి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే రేగాకు పేద కుటుంబాలను పరామర్శించే తీరిక లేదు

**-బీఎస్పీ జిల్లా కార్యదర్శి కే.వీ.రమణ**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :



బూర్గంపహాడ్ మండల కేంద్రం పాండవబస్తీలో మేక వెంకట నర్సయ్య అనే పేద రైతు కుటుంబాన్ని బహుజన సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి కే.వీ.రమణ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. వెంకట నర్సయ్య గోదావరి వరదల కారణంగా జరిగిన పడవ ప్రమాదంలో ఆయన మరణించి నేటికి 20 రోజులు కావస్తుందని, అయినా స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు బాధిత కుటుంబాన్ని వచ్చి పరామర్శించకపోవడం శోచనీయమని అన్నారు. నియోజకవర్గంలో గతంలో అగ్రవర్గాల కుటుంబంలో ఇటువంటి విషాదకర సంఘటనలు జరిగిన వెను వెంటనే క్షణం ఆలస్యం లేకుండా స్పందించి స్వయంగా పరామర్శించే ఆ ఎమ్మెల్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద కుటుంబాలలో మాత్రం ఏదైనా విషాదకర సంఘటనలు జరిగితే కనీసం తిరిగి చూడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ సంఘటనతో ఎస్సీ కుటుంబాలపై రేగా కాంతారావుకు గల ద్వంద వైఖరిని తెలియజేస్తూ భవిష్యత్తులో ఈ విధానాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.

# నిత్యావసర సరుకులను పంపిణీ ప్రారంభించిన జడ్పీటీసీ శ్రీలత

బూర్గంపహాడ్, ప్రభాతవార్త ::

భద్రాద్రికొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభుత్వ విఫ్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు మరియు రాజ్యసభ సభ్యులు బండి పార్ధసారధి సహకారంతో బూర్గంపహాడ్ మండల కేంద్రంలో గోదావరి ముంపు ప్రాంత ప్రజలకు బియ్యంతో పాటుగా నిత్యావసర సరుకులను బూర్గంపహాడ్ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. బూర్గంపహాడ్ గ్రామపంచాయతీలో ముంపు బాదితులకు బియ్యంతో పాటుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రభుత్వం తరుపున రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా సీఎం కేసిఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారని గోదావరి ముంపు ప్రాంత ప్రజలకు అండగా ఉంటామని ఆమె అన్నారు. గోదావరి ముంపు ప్రాంత ప్రజలకు స్థానిక శాసనసభ్యులు రేగా కాంతారావు, రాజ్యసభ



సభ్యులు బండి పార్ధసారధిరెడ్డి సహకారంతో కోటి రూపాయలతో పినపాక నియోజకవర్గంలో 13వేల కుటుంబాలకు బియ్యంతో పాటుగా పలు రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా సీఎం కేసిఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఒక్క బాధితుడికి బ్యాంకు ఖాతాలో రూ.10వేలు జమ చేయడం జరిగిందన్నారు. రెండు నెలల పాటు 25 కిలోలు బియ్యం ఇవ్వడం జరుగుతుందనాన్నరు. వరద బాధితుల కోసం సుమారు రూ.1000 కోట్లతో ఎత్తైన ప్రదేశాలలో ప్రభుత్వం ఇల్లు నిర్మాణాలను చేపడుతుందన్నారు. భవిష్యత్తులో గోదావరి వరద ఉధృతికి గ్రామాలు మనుగడం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, స్థానిక సర్పంచ్ సిరిపురపు స్వప్న, మాజీ సర్పంచ్ జక్కం సుబ్రహ్మణ్యం, టిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షులు సాధిక్, సాబీర్‌పాషా, సోహెల్‌పాషా, వార్డు సభ్యులు సాకేత్, సంపత్ టిఆర్ఎస్ నాయకులు తోకల సతీష్, గంగరాజుయాదవ్, చెన్నం రవి, కన్నెపల్లి సతీష్, మందా ప్రసాద్, కేసుపాక మహేష్, షబాజ్, రాఘవులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి

*నర్సంపేట, ఆగస్టు 5,ప్రభాతవార్త*

వీఆర్ఏల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆర్పిఐ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య అన్నారు. శుక్రవారం వీఆర్ఏల సమ్మెకు సంఘీభావం తెలిపిన అనంతరం వారు మాట్లాడుతూ నీళ్లు, నిధుల, నియమకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు రోడ్డుపైకి వచ్చి వారి హక్కుల కోసం ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి వచ్చి నందుకు కేసిఆర్ సిగ్గుతో తలదించుకొని ఉదో ్యగులకు తగిన న్యాయం చేయవలిసింది పోయి న్యామైన హక్కుల కోసం పోరాటం చేస్తున్న కళాకారులు ఐక ్యమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార ్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి రుద్రారపు హేమలత, వరంగల్ పట్టణ అధ్యక్షురాలు బొల్లిం సంధ్య, స్థానిక వీఆర్ఏల సంఘం నాయకులు బిర్రు సునిల్, అనిల్, గణేష్, ఉపేందర్, శోభ, ఫర్జానా, రమాదేవి, స్వప్న, నాగదీప్తి తదితరులు పాల్గొన్నారు.



**చెన్నారావుపేటలో...**

న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ వీఆర్ఏలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు వీఆర్ఏలు అంతా స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపిడివో దయాకర్, మండల సమాఖ్యలో ఏపిఎం ఈశ్వరయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి దిలీప్, వ్యవసాయ శాఖలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి మండల చైర్మన్ శీలం రాజు, ప్రధాన కార్యదర్శి గొల్లపెల్లి రాజశేఖర్,చాంటి శివకోటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**దుగ్గొండిలో....**

వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంసిపిఐయు వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుంబ బాబురావు అన్నారు. మండల కేంద్రంలో వీఆర్ఏలు నిరవదిక సమ్మె శుక్రవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. ఎంసిపిఐయు నాయకులు సంఘాభావం తెలిపారు. ఈ సంఘీభావంలో ఎంసిపిఐయు నాయకులు నాగెల్లి కొమురయ్య, ఐలు కొమురయ్య, రాజసాహెబ్, పర్లపల్లి రవీందర్, మురళి, సదానందం, గై.నాగరాజు, కొమురయ్య, సారయ్య, పాషా, పైడి పాల్గొన్నారు. కాగా వివేకంద గ్రాడ్యుయేట్ అసోసియేషన్ అధ్యక్షులు డా.పెంచాల శ్రీనివాస్ వీఆర్ఏలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

**నెక్కొండలో....**

నెక్కొండ తహసీల్దార్ కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ జేఏసీ పిలుపు మేరకు నిరవదికసమ్మె చేయుటకు నిర్ణయించి నెక్కొండ మండల వీఆర్ఏలు 12వ రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు శాంతియుతంగా నిరసన సమ్మె కొనసాగించారు. వీఆర్ఏలకు పే స్కేలు వెంటనే విడుదల చేయాలని, అర్హులైన వారికి పదోన్నతలు, 55 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల స్థానంలో తమ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల జేఏసీ చైర్మన్ సింగారపు రమేష్, కో చైర్మన్ ఇల్లుటూరి రవికుమార్, సెక్రటరి జనరల్ మహమ్మద్, ఖాసీం, మహమ్మద్ సహారర తదితరులు పాల్గొన్నారు.






## మధిరను ముంచెత్తిన వర్షం

### లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం

*మధిర,ఆగస్టు 5, ప్రభాతవార్త :*



మధిర పట్టణంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని ప్రదాన వీధులన్నీ జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో నల్లని మేఘాలతో మేఘావృతమై కురిసిన భారీ వర్షం 2గంటల పాటు భయానక వాతావరణాన్ని కల్పించిందని చెప్పవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ఆవరణలు జలమయమయ్యాయి. మిషన్ భగీరథ పైప్లైన్ల కోసం తీసిన గుంటల్లో నీరు చెరడంతో పాటు వరద నీరు మారుతుండడంతో ఎక్కడ ఏప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళన వాహనదారులు నెలకొంది. ఇదిలా ఉండగా పట్టణంలోని ప్రాంతాలు పలు గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం ప్రభావంతో దేశనేనిపాలెం గ్రామంలో ఎస్సీ కాలనీలోకి వర్షంపు నీరు చేరింది. అలాగే దేశనేనిపాలెం జొన్నలగడ్డ గ్రామాల మధ్య ఉన్న కాల్వ వర్షంపు నీటితో పారడంతో 2గ్రామాల మధ్య కొంతసేపు రాకపోకలు నలిచిపోయాయి. వర్షం తగ్గుముఖం పట్టిన తర్వాత మున్సిపాలిటీ చైర్ పర్సన్ మొండితోక లత, కమిషనర్ రమాదేవిల పర్యవేక్షణలో మున్సిపల్ యంత్రాంగం వర్షంపు నీటిని మళ్ళించడానికి కాల్వల పూడికలను జేసీబీతో తీసే చర్యలు చేపట్టారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారీ వర్షానికి పోటెత్తిన వర్షంపు నీరును జేసీబీతో డ్రైనేజ్లు, కాల్వలను వెడల్పు చేసి నీరు పోయే విధంగా పోలీసుల సహకారంతో పనులు నిర్వహించారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

*నర్సంపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త*



నర్సంపేట వాసవి కళ్యాణ మండప ం నందు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించినారు. మండల కమిటీ అధ్యక్షులు శింగిరికొండ మాధవశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వంగేటి గోవర్ధన్,పబ్బా రమేష్, గర్రెపల్లి శ్రీనివాస్, నాగమల్లి కృష్ణమూర్తి, పిన్న రామనాథం, దొడ్డ రవీందర్, మహిళా విభాగ అధ్యక్షురాలు శింగిరికొండ రజిని, ఆర్యవైశ్య మహిళలు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవి కన్యాకా పరమేశ్వరి అమ్మవారికి 21 చీరలతో అమ్మవారికి అలంకరణ చేసినారు.

## కెవిపిఎస్ రాష్ట్ర 3వ మహాసభలు

*నర్సంపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త*

కెవిపిఎస్ రాష్ట్ర 3వ మహాసభలు వాల్పోస్టర్ను శుక్రవారం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హన్మకొండ ఆనంద్ ఆవిష్కరించారు.దళితుల సమస్యల పరిష్కరం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కెవిపిఎస్ రాష్ట్ర 3వ మహాసభలు ఆగస్టు 7 నుండి 9 వరకు సంగారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు కువిపిఎస్ జిల్లా అధ్యక్షులు హన్మకొండ ఆనంద్ తెలిపారు.ఈ మేరకు నర్సంపేట కార్యాలయంలో కెవిపిఎస్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల గోడపత్రికలను వాల్ పోస్టర్ను వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనం తరం వారు మాట్లాడుతూ ఆగస్టు 7న సంగారెడ్డిలో నీలిదండు కవాతు రిజర్వేషన్ల రద్దుకు కుట్రలు చేస్తుందన్నారు.బీజేపీ విధానాలు దళితులకు ఈ 7న జరిగే బహిరంగ సభ వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ పట్టణ అధ్యక్షులు మోలుగురి రాజు, హన్మకొండ సంజీవ, యాకయ్య, నర్సింహా రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

*నర్సంపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త*



పార్లమెంట్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మూమెంట్ ఫర్ పీస్ జస్టిస్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్ 14వ రోజు రిలే నిరాహార దీక్షలు దళితరత్న కళ్లెపెల్లి ప్రణయ్దీప్ మహాజన సోషలిస్టు పార్టీ నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జి అందె రవి రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఆర్అండ్బి గెస్ట్ హౌజ్ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు వేల్పుగొండ రాజు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన వారు మాట్లాడుతూ రిలే నిరాహార దీక్షలు ఉద్దేశించి మాట్లాడారు. పార్లమెంట్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళాకారుడు తాళ్ల సునిల్, కొండపల్లి లావణ ్య మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రతినిధి గుంపుల మాలతి, ఎంఎస్పీ అంబేద్కర్ నగర్ అధ్యక్షులు మునిగె యాకుబ్, రాజు, మాదాసి బాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వరలక్ష్మివ్రత వేడుకలు

*చెన్నారావుపేట, ఆగస్టు 5,ప్రభాతవార్త*



చెన్నా రావుపేటలో శుక్రవారం వరలక్ష్మివ్రత వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రావణ మాసాన్ని పురస్క రించుకొని స్థానిక సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బిక్షపతి శాస్త్రీ, సాయిశాస్త్రీల ఆధ్వర్యంలో లక్ష్మిదేవతకు వ్రత పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు కంది విజయగోపాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

*నర్సంపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త*



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వ్యతిరేకిస్తూ నర్సంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిరసన ఏఐసీసీ, టిపిసిసి ఆదేశాల మేరకు ఏఐసిసి సభ్యులు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలపై పెట్రోల్, డిజిల్, వంట గ్యాస్ అలాగే నిత్యవసర వస్తువులపై ధరలు పెంచుతున్నందున ఇటీవల కురిసిన వర్షాలకు నిరాశ్రయులైన వరద బాధితులకు ఎటువంటి సహాయ సహకారాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రజలకు అందనందున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనపై నిరసిస్తూ నర్సంపేటలోని వరంగల్ కూడలి వద్ద ధర్నా నిర్వహించి తదనంతరం నర్సంపేట రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో రెవిన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రాన్ని టిపిసిస సభ్యులు సొంటిరెడ్డి సభ్యులు పెండెం రామానంద్, నియోజవర్గ కన్వీనర్ తక్కళ్లపెల్లి రవీందర్రావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు బత్తిని రాజేందర్, నర్సంపేట, బ్లాక్ అధ క్షులు తోకల శ్రీనివాస్రెడ్డి, ఎడ్ల జగన్మోహన్రెడ్డి, నర్సంపేట మండల అధ్యక్షులు బానోతు లక్ష్మణ్నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కర్నాటి పార్వతమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు ఎలకంటి విజయ్కుమార్, ఓర్సు అంజలిపాల్గొన్నారు.




# అన్ని పాఠశాలల్లో స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్వి సప్తహా కార్యక్రమాన్ని నిర్వహించాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 5 - ప్రభాతవార్త:

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్వి సప్తహా కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం పండుగ వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని డీఈవో సోమశేఖరశర్మ అన్నారు. అన్ని మండలాల ఎంఈవోలు, పాఠశాలల హెచ్ఎంలతో శుక్రవారం జూమ్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు పూర్తవుతున్న నేపద్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న, స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్వి సప్తాహం కార్యక్రమం సందర్భంగా ఆయన షెడ్యూల్‌ను వివరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొనేలా చూడాలని హెచ్ఎంలను కోరారు. పాఠశాల విద్యార్థులు మొదలుకొని ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు గాంధీ సినిమాను చూసే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని, ఈ సందర్భంగా విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా గాంధీ సినిమాను ప్రతీ ఒక్కరూ థియేటర్‌కు వెళ్లి చూసే విధంగా చూడాలని ఆదేశించారు. ఆగస్టు 10వ తేదీన వజ్రోత్సవ వన మహోత్సవాన్ని నిర్వహించి ప్రతీ విద్యాసంస్థలో కనీసం 75 మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ నాగరాజశేఖర్, ఎస్‌కే సైదులు, అన్నామణి, సతీష్‌కుమార్, ఏపీవో కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించిన కూనంనేని

సుజాతనగర్, ఆగస్టు 5 - ప్రభాతవార్త:



ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సుజాతనగర్ గ్రామానికి చెందిన అన్నవరపు వెంకటేశ్వర్లు కుటుంబాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాబీర్‌పాషా, కందుల భాస్కర్‌లు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెం, ఆగస్టు 5 - ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌ను కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువ కప్పి సత్కరించారు. ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి: కూనంనేని

సుజాతనగర్, ఆగస్టు 5 - ప్రభాతవార్త:



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

గతంలో వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం సుజాతనగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 12వ రోజు దీక్ష చేస్తున్న వీఆర్ఏలకు సంఘీభావం తెలిపారు. వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 55 సంవత్సరాలు నిండిన వీఆర్ఏలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన జీవోలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, భాస్కర్, కోమారి వీర హనుమంతరావు, కత్తి వెంకన్న, సత్యనారాయణలు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అందించాలి

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 5 - ప్రభాతవార్త:



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

సింగరేణి సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అందించాలని కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహజంచారు. ఇందులో భాగంగా హెడ్డాఫీస్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అధికారులకు మెమోరాండం అందించారు. ఈ నెల 8వ తేదీన జరిగే చర్చల్లో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు మంచి శుభవార్త తేవాలని కోరారు. లేనియెడల కార్యక్రమాలు ఉదతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాసూరి శంకర్, గూడెల్లి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ రాసే అభ్యర్థుల సౌకర్యార్థమై పార్కింగ్ స్థలం ఏర్పాటు

### -ట్రాఫిక్ ఎస్సై వి.ఎన్.రావు

భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :



భద్రా చలంలో ఆదివారం ప్రాథమిక పరీక్ష (ఎస్సై ప్రిలిమ్స్ ఎగ్జామ్స్) రాస్తున్న అభ్యర్థులు పరీక్ష సెంటర్ వద్ద వాహనములు పెట్టుటకు పార్కింగ్ సదుపాయం లేనందున అభ్యర్థుల సౌకర్యం కొరకు ఎగ్జామ్స్ సెంటర్‌కు దగ్గరలో పార్కింగ్ సదుపాయం కల్పించడం జరిగిందని ట్రాఫిక్ ఎస్సై డా.వి.ఎన్.రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ బ్లాక్‌లో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ బ్లాక్‌లో పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో పార్కింగ్ స్థలం కేటాయించడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా మథర్‌థెరిస్సా కళాశాలలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు ఐటీడీఏ రోడ్డు గిరిజన భవన్ వద్ద పారినంగ్ స్థలం కేటాయించడం జరిగిందని, త్రివేణీ కళాశాలలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు న్యూవెజ్‌మార్కెట్ వద్ద పార్కింగ్ స్థలం కేటాయించడం జరిగిందని, బి.ఈడీ కళాశాలలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు గిరిజన అభ్యదర భవన్ చర్ల రోడ్డు వద్ద పార్కింగ్ స్థలం కేటాయించినట్లు, టిటిడబ్ల్యూఆర్‌జేసీ (బాలికలు) కళాశాలలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు కళాశాల గేట్ వెలుపల పార్కింగ్ స్థలం కేటాయించామని ఆయన వివరించారు. అభ్యర్థులంతా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

# అమరవీరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలి

కొత్తగూడెం టౌన్,ఆగస్టు 5 - ప్రభాతవార్త:




1969లో జరిగిన తెలంగాణ ఉద్యమ పోరాటంలో అమరులైన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా అందించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు వి.శాంతిరాం అన్నారు. శుక్రవారం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ... 1969 ఆగస్టు 5వ తేదీన నాటి ఏపీ హోం మంత్రి దివంగత జలగం వంగళరావు పర్యటన సందర్భంగా జరిగిన పోలీస్ కాల్పుల్లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులైన రాంచందర్, దస్తగిరిలు అమరులయ్యారరని, మరికొంత మంది పోలీస్ బుల్లెట్లు తగిలి గాయలపాలయ్యారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి 8 సంవత్సరాలు అయినా అమరుల కుటుంబాలకు న్యాయం జరగలేదని, వెంటనే ఒక్కో కుటుంబానికి రూ.20 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ గౌస్, గెల్లోం, ఆరెపల్లి మల్లేష్, మంగపతిరావు, సారయ్య, నాగేశ్వరరావు, యాదగిరి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వయోశ్రేష్ట సమ్మాన్‌కోసం ధరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 5 - ప్రభాతవార్త:

అంతర్జాతీయ వయోవృద్దుల దినోత్సవం సందర్భంగా వయోవృద్దులకు వయోశ్రేష్ట సమ్మాన్ (జాతీయ అవార్డు) 2022 కోసం ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి వరలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, స్వచ్ఛంద సంస్థల నుంచి 16 కేటగిరిల నుంచి వయోశ్రేష్టసమ్మాన్ కోసం ధరఖాస్తులు చేసుకోవాలని, ఈ నెల 9వ తేదీలోగా ధరఖాస్తులను అందజేయాలని, మరింత సమాచారం కోసం 6301981960 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

# పెంచిన నిత్యావసర ధరలు, జీఎస్టీనీ వెంటనే రద్దు చేయాలి

## - కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ

**కొత్తగూడెం, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని, పెంచిన నిత్యావసర సరుకుల ధరలను, జీఎస్టీనీ తక్షణమే రద్దు చేయాలని టీపీసీసీ మెంబర్ ఎడవల్లి కృష్ణ అన్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి ధర్నాచౌక్ వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నర్విహించారు. ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టిన అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకలు

మహిళ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు, అభిమానులు అందరూ ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించా రు. అనంతరం ఎడవల్లి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మోడీ నేతృత్వంలో వారి ఇష్టానుసా రంగా నిత్యావసర సరుకులపై ధరలు పెంచుకుంటూపోతే సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని, సామాన్య మధ్య తరగతి ప్రజలు కాయకష్టం చేసుకుంటే కానీ పూట గడవని పరిస్థితుల్లో ఇలా ధరలు పెంచుకుంటూ పోతే ప్రజలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. కొత్తగా జీఎస్టీని పెట్టారని, ఆఖరికి చనిపోయే శవానికి కూడా జీఎస్టీ అంటే ఇది స్వాతంత్ర దేశంలో కూడా పూర్వ రాజులు శాసనంగా మారిందని అన్నారు. వెంటనే పెంచిన ధరలు, జీఎస్టీని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, ఆంతోటి పాల్, సకినాల వెంకటేశ్వరరావు, పల్లపు వెంకటేశ్వర్లు, డాక్టర్ శంకర్ నాయక్, లక్కినేని సాయి, కోటేష్, సుబ్బారెడ్డి, బద్ది కిషోర్‌లు పాల్గొన్నారు.



ధర్నా సందర్భంగా మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ




## జెన్కో సీఎండీని కలిసిన సెంట్రల్ స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్లు

**పాల్వంచ, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**


సీఎండీకి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

టీఎస్‌జెన్కో సెంట్రల్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, డైరెక్టర్ అశోక్‌కుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు, హైదరాబాద్ విద్యుత్ సౌధాలో మర్యాద పూర్వకంగా సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావును కలిశారు. స్పోర్ట్స్ కౌన్సిల్‌కు కావాల్సిన క్రీడా సామాగ్రిని ఇవ్వాలని, ఫండ్స్ పెంపుదల గురించి మాట్లాడారు. వ్యాయామశాల కోసం కావాల్సిన పరికరాలను ఇవ్వాలని కోరారు. వెంటనే క్రీడా సామాగ్రిని అందజేస్తామని సీఎండీ చెప్పారు.

## ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొన్న కొత్వాల

**పాల్వంచ, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**


చిన్నారిని ఆశీర్వదిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ మండలంలోని పాండురంగాపురం నివాసి ఆడెపు గురవయ్య మనుమరాలు, కాంట్రాక్టర్ ఆడెపు రామలింగయ్య కుమార్తె ఓణీల అలంకరణ వేడుకల్లో డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని చిన్నారి శ్లోక యాదవ్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆడెపు వెంకట్రావు, సందు ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, లింగం శ్రీను, సుబ్బారెడ్డి, వెంకటనారాయణలు పాల్గొన్నారు.

## హాస్టళ్లను విజిట్ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

**జూలూరుపాడు, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**


భోజనాన్ని పరిశీలించి మాట్లాడుతన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్

జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురం గ్రామంలోని పోస్ట్ మెట్రిక్ గిరిజన బాలికల కళాశాల వసతి గృహం, బాలికల ఆశ్రమ పాఠశాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు వస్తున్న సరుకులు, కూరగాయలను, సరుకులు భద్రపరుస్తున్న గదులను, పిల్లలు వాడే బోరు నీళ్లను, ఆర్‌వో ప్లాంట్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ఎలా పెడుతున్నారని, పౌష్టికాహారం అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. హెచ్ఎం రమేష్, వార్డెన్ తారాదేవి, పీఎంహెచ్ హాస్టల్ వార్డెన్ తార తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీకి ఘన సన్మానం

**చుంచుపల్లి, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**


ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

చుంచుపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బదావత్ శాంతి ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలోని తనఛాంబర్‌లో అధికారులు ఘనంగా సన్మానించారు. శాలువ కప్పి సత్కరించారు. ఎంపీడీవో సకినాల రమేష్, ఎంపీవో గుంటి సత్యనారాయణ, జేఈ నాగేందర్, ఏపీవో రఘుపతి, టీఏ అనీల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## సింగభూపాలెం ప్రాజెక్టు పనులు పరిశీలన

**సుజాతనగర్, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**


కాలువను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

సింగభూపాలెం ప్రాజెక్టు పనులను రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య పరిశీలించారు. ప్రాజెక్టు కాలువలో మట్టి, చెత్తాచెదారం పేరుకుపోయి రైతుల నీళ్లు కాలువ నుంచి రాక ఇబ్బంది పడుతున్నారని, అధికారులు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కాలువ మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. చికెన్‌షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను ఈ కాలువలో పడేస్తున్నారని, ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరిగేషన్ జేఈ కార్తీక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, ఉడుగుల శ్రీకాంత్, నల్లగోపు పుల్లయ్య, చల్లగొండ సత్యనారాయణ, కుచెం రాంబాబులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ

**పాల్వంచ, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**



గొడుగులు అందజేస్తున్న దృశ్యం

లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ పాల్వంచ అధ్యక్షుడు లయన్ చాట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కారర్యక్రమంలో లయన్ పోట్ర సతీష్, కోశాదికారి లయన్ యశ్వంత్, లయన్ ఆరుద్ర సత్యనారాయణ, రోశయ్య చౌదరి, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

## పోతపాలు వద్దు... తల్లిపాలే ముద్దు...

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పిల్లలకు పోతపాలు పట్టించ వద్దని... తల్లిపాలే ముద్దని కౌన్సిలర్ తలుగు అనీల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండేళ్ల వరకు పిల్లలకు తల్లిపాలు తాగించాలని చెప్పారు. తల్లిపాలే పిల్లలకు మొదటిటీకాగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్ శ్రీదేవి, మనోహరి, సరస్వతి, ఏఎన్ఎం రమణ, ఆశాలు శారద, గర్భిణీలు పాల్గొన్నారు.

## చీఫ్ సెక్యూరిటీ అధికారిగా శశిధర్‌రాజు


**కొత్తగూడెం, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**



సింగరేణి చీఫ్ సెక్యూరిటీ అధికారిగా చెన్నమాధవుని శశిధర్‌రాజు శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పోరేట్ ఎస్‌అండ్‌పీసీ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ జాకీర్ హుస్సేన్, ఎస్ఎస్‌వో వేణుమాధవ్, ఎస్‌వోటు చీఫ్ ఆఫ్ సెక్యూరిటీ, జమేదార్‌లు పాల్గొన్నారు.

## పారితోషికం అందజేసిన జీఎం పర్సనల్

**కొత్తగూడెం, ఆగస్టు 5 - ప్రభాతవార్త:**


పారితోషకం అందజేస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి ప్రధాన కార్యాలయం కార్పోరేట్ ఏరియా పరిధిలోని ఉద్యోగులకు యోగా శిక్షణ ఇస్తున్న యోగా గురువు గుమలాపురం సత్యనారాయణకు జీఎం పర్సనల్ బసవయ్య చెక్కు రూపంలో పారితోషికం అందించారు. యోగా ప్రతీ ఒక్కరూ కుల మత లింగ వయసు తేడాలు లేకుండా అందరూ చేయవచ్చని, యోగా శరీరాన్ని మనస్సును ఏకీకృతం చేస్తుందని, విచక్షణ జ్ఞానాన్ని, ఆలోచన శక్తిని, జానఒపకశక్తిని పెంచుతుందని అన్నారు. యోగావల్ల బీపీ, మధుమేహం లాంటివి నియంత్రణలో ఉంటాయని, ముఖ్యంగా ఎక్కువ సేపు కూర్చొని పనిచేసే ఉద్యోగులు, పని ఒత్తిడికి గురయ్యేవారు రోజుకు కనీసం 30 నిమిషాలపాటు యోగా చేయాలన్నారు. డీజీఎం పర్సనల్ వెల్ఫేర్ శ్రీనివాసరావు, సీనియర్ పీవో బేతిరాజు, పీఏ వరప్రసాద్, సాయికృష్ణలు పాల్గొన్నారు.

# మృత్యువుతో పోరాటం చేస్తున్న ముత్యాలరావు

**- ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న కుటుంబం**

*చంద్రుగొండ, ఆగష్టు 5 - ప్రభాతవార్త:*

ఊరిలో మంచిపేరు ఉండటానికి ఇల్లు కాస్తంత భూమి కలిగిన ముత్యం లాంటి ముత్యాలరావు గత 17 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకొని ఇద్దరు అమ్మాయిలకు జన్మనిచ్చారు. 9 సంవత్సరాలు ఆ కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేకుండా జీవనాన్ని సాగిస్తున్న ముత్యాలరావు కుటుంబంపై 2014లో ఇది కన్ను పడింది. విధి ఆడుతున్న ఆటలో ముత్యాలరావు కుటుంబం ఆస్తి అంతా పోయి చివరికి ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న ముత్యాలరావు దీనగాధపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం...

చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన చింతలపూడి ముత్యాలరావుకు అనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన సునీతతో గత 17 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వారికి ఇద్దరు అమ్మాయిలు అంజలి, అఖిల అనే ఇద్దరమ్మాయిలు జన్మించారు. ఆ ఇద్దరు పిల్లలతో పాటు ముత్యాలరావు తల్లి కోటమ్మ అందరూ హాయిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తునానరు. 2014లో ముత్యాలరావు తన వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో కాలికి పాము అస్థిపంజరంలో పాము వెన్నుపూసలో ఉన్న ముళ్ల లాంటి ఎముక కాలుకు గుచ్చుకుంది. దీంతో కాలు వాపు రావడంతో కొత్తగూడెం, ఖమ్మం పట్టణాల్లో వైద్యం చేయించినా తగ్గకపోగా ఇన్ఫెక్షన్ అయి రెండు కిడ్నీలపై పడినట్లు తెలిపారు. వైద్యం చేసుకునేందుకు ముత్యాలరావుకున్న వ్యవసాయ



ముత్యాలరావు కుటుంబం



భూమిని సైతం అమ్మి వైద్యం చేయించారు. అయినా తగ్గకపోవడం చేతులు చిల్లిగవ్వ లేకపోవడంతో ముత్యాలరావు భార్య సునీత, తల్లి కోటమ్మలు కూలీ పనులు చేస్తూ ముత్యాలరావుకు వైద్యం అందిస్తున్నారు. ఇంట్లో అన్నం కూడా సరిగా లేకపోవడంతో ఆ ఇద్దరు అమ్మాయిలను తిప్పనపల్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంతో మధ్యాహ్న భోజనంతో సరిపెట్టుకున్న రోజులు ఎన్నో ఉన్నాయంటూ ఆ ఇద్దరు చిన్నారులు తెలుపుతూ భావోద్వేగానికి లోనయ్యారు. కనీసం కన్న పిల్లలకు అన్నం కూడా సరిగా పెట్టలేకపోతున్నానని ఆ కుటుంబాన్ని మరింత కుంగదీసింది. పిల్లలకైనా మూడు పూటల అన్నం దొరికితే చాలు అనుకొని ఆ తల్లి సునీత తమ ఇద్దరు పిల్లలను చంద్రుగొండ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చేర్పించారు. ప్రతీ రోజు కూలీ పనులు చేస్తే వచ్చే డబ్బులతో ముత్యాలరావుకు డయాలసిస్ చేయిస్తున్నారు. నెలకు మూడుసార్లు డయాలసిస్ ఏయించేందుకు కొత్తగూడెం ప్రభుత్వ



ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఆటో ఖర్చులు, కొన్ని టెస్టులు బయట చేసేందుకు, మందులు ఖర్చులు సుమారు రూ.10 వేలు అవుతుందని వారు చెప్తున్నారు. మనసున్న మహరాజులు దాతలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఎవరైనా తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆసరా పెన్షన్ అయినా ఇస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉంటుందని, ఎవరిని కలిసినా ఎవరూ తమకు సహాయం చేయడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. ఎవరైనా దాతలు ఎంతే ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా నంబర్ 62448742001, ఐఎఫ్ఎస్‌సీ నంబర్ ఎస్‌బీఐఎన్0021386, చంద్రుగొండ బ్రాంచ్, ఫోన్ నంబర్ 6304647021 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

**- ఏడ్చి ఏడ్చి అలసిపోయాను : తల్లి కోటమ్మ**

గత ఎనిమిది సంవత్సరాల నుంచి కొడుకును మంచంపై చూస్తుంటే ఏడవని రోజు లేదు. చెయ్యని పూజలు లేవు, మొక్కని దేవుడు లేడు. ప్రతీ రోజు నా కోడలు, నేను కూలీ చేస్తూ నా కొడుకుకి నెలకు రూ.10 వేలు పెట్టి డయాలసిస్, మందులు, ఇతర ఖర్చులు వెళ్లదీస్తున్నాం. మాకు ఏదైనా అనారోగ్యం వస్తే మాత్రంమరింత ఇబ్బంది అవుతుంది. నావయసు కూడా మీద పడటంతో కోడలుకు ఆరోగ్యం పరిస్థితి సరిగా లేకపోవడంతో ప్రతీ రోజు పనికి వెళ్లలేక పోతున్నాం. ఇల్లు గడవటం కూడా చాలా కష్టం ఉంది. ప్రభుత్వం అయినా మా కుటుంబాన్ని ఆదుకోవాలి. నా ప్రాణం పోయేంత వరకైనా నా కొడుకు వైద్యం చేయించేందుకు దాతలు ముందుకు రావాలని వేడుకుంటున్నారు.

# వనరులు, హక్కుల రక్షణకు ఆదివాసీలు పోరాటానికి సిద్ధంకండి

**-ఈ నెల 9న అంతర్జాతీయ మూలవాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి**

**-సీపీఐ(మావోయిస్టు) భద్రాద్రికొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్**

*చర్ల, ప్రభాతవార్త :*

ఆదివాసీల సంస్కృతిక జీవన విధానాన్ని, వారి హక్కులను పరిరక్షించాలనే లక్ష్యంతో 1993 నుండి నేటి వరకు 29 సంవత్సరాల పాటు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలు జరుపుకుంటున్నారని ప్రపంచ వ్యాప్తంగా 40 కోట్ల మందికి పైగా జనాభా ఉన్న ఆదివాసీ ప్రాంతాలు ప్రతి రోజు పరాయికరణకు గురవుతున్నారని, అడవులపై ఆదివాసీలకే సంపూర్ణ హక్కు ఉందని ప్రభుత్వాలు చెపుతున్నప్పటికి, చట్టాలు ఉన్నప్పటికి అవి అమలుకు నోచుకోవడం లేదని, ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న ఖనిజ సంపద ఇతర వనరులను దోపిడికి గురవుతున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రికొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ పేరిట శుక్రవారం మండలంలో లేఖలు దర్శనమిచ్చాయి. కార్పొరేట్ సంస్థలు ఆదివాసీలపై నరమేదం కొనసాగిస్తున్నాయని అంతర్‌యుద్ధం పరిస్థితుల మధ్యన ఆదివాసీలు నలిగి పోతున్నారని, ఆదివాసీల ఓట్లతో గెలిచిన ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు ఆదివాసీ సమస్యలపై ఏ నాడు చట్టసభల్లో నోరు మెదపలేదని, ఆయా రాజకీయ పార్టీల చేతిబొమ్మలుగా మారారని విమర్శించారు. భారతదేశంలో సహజ వనరులను ఖనిజ వనరులను ధ్వంసం చేస్తున్న తరుణంలో దానికి వ్యతిరేకంగా మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో మధ్యభారతం కేంద్రంగా ఉన్న ఆదివాసీలు నడిపే ప్రత్నామ్నాయ పరిపాలన (జనతన్ సర్కార్)లో భాగమైన ఆదివాసీలు జల్‌జంగిల్ జమీన్‌ను ఉమ్మడి జీవన విధానాన్ని రక్షించుకోవడంలో తమ ప్రాణాలను బలి పెడుతూ వీరోచితంగా పోరాడుతున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రికొత్తగూడెం, అల్లూరిసీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేర్కొన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర దోపిడీ పాలక వర్గాల కుట్రలను చిత్తు చేస్తూ ఆగష్టు 9న అంతర్జాతీయ మూలవాసీ దినాన్ని నూతన అటవీ సంరక్షణ నియమాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించాలని, జల్, జంగిల్‌జమీన్ ఉమ్మడి జీవన విధానాన్ని రక్షించుకోవడానికై పోరాటాలు చేయాలని, ఆదివాసీ ప్రజల న్యాయమైన పోరాటాలకు కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, పీడిత ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. పెసా చట్టం , 1/70 చట్టం, 5వ, 6వ షెడ్యూల్, జీవో నెంబర్ 3 అమలుకై పోరడండి ! మూలవాసీ ప్రజలపై ఫారెస్టు అధికారుల జులుంకు వ్యతిరేకంగా పోరాడండని ఆజాద్ పేరిట ఆ లేఖలో పేర్కొని ఉంది.

# దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం, నేటి యువతలో స్ఫూర్తి నింపే గొప్ప కార్యక్రమం దివ్యోత్సవం

**- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

*కొత్తగూడెం, ఆగష్టు 5 - ప్రభాతవార్త:*



దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం, నేటి యువతలో స్ఫూర్తి నింపే గొప్ప కార్యక్రమం దివ్యోత్సవం అని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో టీవీపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వర్లు, టీవీపీఎస్ నాయకులు గుండపనేని సతీష్, జగ్గుదాస్, హుస్సేన్ మియా, కడలి సాయిబాబా, సున్నం కరుణాకర్‌లు పాల్గొన్నారు

# భద్రాద్రి రామయ్య సన్నిధిలో శ్రావణశుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు

*భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :*



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపాలయంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీతాయారు అమ్మవారికి ఉదయం విశేష అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద గల చిత్రకూట మండలంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతంలో పాల్గొనేందుకు మహిళలు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు కదిలి వచ్చారు. ఆలయ అర్చకులు మహిళలచే సామూహిక కుంకుమార్చన, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పారాయణం నిర్వహించారు.

# కన్నులపండువగా రామయ్య కళ్యాణం

*భద్రాచలంకల్చరల్ ప్రభాతవార్త :*

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో భద్రాద్రి రామయ్య కళ్యాణం కన్నులపండువగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నది నుండి జలాలను మేలతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ప్రధాన ఆలయానికి తీసుకున వచ్చి స్వామి వారి మూలవరులకు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి కళ్యాణ మూర్తులను బేడా మండపానికి భక్తుల జయజయ ధ్వానాల నడుమ తీసుకుని వచ్చారు. ముందుగా భద్రాద్రి దివ్యక్షేత్ర మహత్యాన్ని భక్తులకు అర్చక స్వాములు తెలిపిన అనంతరం కళ్యాణ తంతు ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన జరిపి కళ్యాణ తంతును కన్నుల పండువగా నిర్వహించారు. అనేక మంది దంపతులు ఈ కళ్యాణంలో పాల్గొని తరించారు. కళ్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి నూతన వస్త్రాలు, అక్షతలు, ప్రసాదం వితరణగావించారు.




# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

## మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

స్తంభాద్రి ఆగస్టు 5 ప్రభాతవార్త

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న 8వ రాష్ట్ర స్థాయి అండర్-19 బాయ్స్, గర్ల్స్, వెటరన్స్ 50+, 60 క్రీడలను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆట ఆడి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పటేల్ స్టేడియంను రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించే విధంగా తయారు చేసుకున్నామని, ముందు ముందు ప్రాంగణములోని అన్ని క్రీడలను అన్ని విధాలుగా



అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయుచున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా అసోసియేషన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తలశిని వెంకటరావు, ఉప్పలరెడ్డి, డీఎస్పీ వెంకట్రావ్, శిరిపురపు సుదర్శన్‌రావు, రవిమారుతీ, కమర్తపు మురళి, యుగంధర్, డి.వై.ఎస్.ఒ. వరంధామరెడ్డి, డీఎస్పీ రామోజీ రమేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## జిల్లా సాంకేతిక ఉద్యాన అధికారిగా సదీప్‌కుమార్

స్తంభాద్రి ఆగస్టు 5 ప్రభాతవార్త



జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయం టెక్నికల్ ఉద్యాన అధికారిగా గుడిమల్ల సందీప్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి జి.అనసూయ ఉత్తర్వులు అందజేశారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను చూసిన మధిర ఉద్యానవన అధికారి ఏ.వేణు నుండి ఖమ్మం ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ ఛార్జ్ తీసుకోనున్నారు. పరిపాలనా పరమైన కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా

ప్రభాతవార్త ప్రత్యేకప్రతినిధి, ఖమ్మం

ఏఐసీసీ, పీసీసీ, సీఎల్పీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కమిటీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనం నుండి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఏఐసీసీ, పిసిసి, సీఎల్పీ పిలుపు మేరకు జనరంజక పాలన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజేపీ రాక్షసపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఈ దేశంలో తాడిత, పీడిత ప్రజలపై నిరంతరం నిత్యావసర




సరుకులపై గ్యాస్ పెట్రోల్, డీజిల్, జీఎస్టీ, అగ్నిపథ్, నోట్లరద్దు, నల్లచట్టాలను రైతులపై రుద్దే కార్యక్రమం అలానే అనేక ప్రజావ్యతిరేక విధానాలను చేపడుతున్న బిజేపీ పాలనకు వ్యతిరేకంగా సోనియాగాంధీ, రాహూల్‌గాంధీల నేతృత్వంలో దేశ వ్యాప్తంగా నిరసన ధర్నాలు జరుగుతున్నాయని, దీనిలో భాగంగానే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన ఆయన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కార్పొరేటర్లు లకావత్ సైదులునాయక్, కొప్పెర సరిత ఉపేందర్; పల్లెబోయిన భారతిచంద్రం, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మణ్, వై.శ్రీశైలం, దోనేవాన్ వెంకట్రావ్, బోజెడ్ల సత్యనారాయణ, ఎనిగండ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రెజొనెన్స్ ఇన్‌ఫో పాఠశాలలో వరలక్ష్మీ వ్రతం

ఖమ్మం ప్రభాతవార్త ఆగస్టు 5



శ్రావణమాసం రెండవ శుక్రవారం శ్రీమహా లక్ష్మీ అమ్మవారిని వరలక్ష్మీ వ్రతంతో పూజ చేసుకునే పర్వదినం సదర్భంగా స్థానిక వీడీఓస్ కాలనీలో రెజొనెన్స్ ఇన్‌ఫో పాఠశాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో పుణ్యవ్రతాన్ని ఆచరించారు. ముందుగా మండపాన్ని ఏర్పాటు చేసిన మండపం పైన బియ్యం, పిండితో ముగ్గువేసి లక్ష్మీదేవిపటాన్ని ఉంచి కలశాన్ని ఏర్పాటుచేశారు. పూజా సామాగ్రిసంతా సిద్ధం చేసుకొని అమ్మవారిని షోడశోపచారాలతో పూజించారు. తొమ్మిది పోగుల తోరమును చేతికి కట్టుకున్నారు. ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. చిన్నారులకు వరలక్ష్మీ వ్రత ఔన్నత్యం, మహత్యం గురించి పాఠశాల డైరెక్టర్ నీలిమ చిన్నారులకు వివరిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలలో భాగమైన వేడుకలలో స్త్రీలు మాత్రమే ప్రత్యేకంగా నిర్వహించే వేడుక శ్రీవరలక్ష్మీవ్రతమని తెలిపారు. అమ్మవారి అనురాగాన్ని అనుగ్రహాన్ని విద్యార్థినులకు అందించటం కోసం పాఠశాలలో నిర్వహించామని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ నీలిమ పూజలో పాల్గొని విద్యార్థులకు మన సంస్కృతి విలువలను తెలుపడానికి ముఖ్యంగా స్త్రీలకు మాత్రమే పరిమితమైన వరలక్ష్మీవ్రతం లాంటి వేడుకను చిన్నారులకు ఆచరించి చూపుటకు నిర్వహించినట్లు తెలిపారు. డైరెక్టర్‌లు ఆర్.వి.నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు, ప్రిన్సిపల్ ఎం.ఎ.బేగ్, ఉపాధ్యయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సిమెంటు హమాలీల కూలీరేట్లు పెంచాలి: ఐఎఫ్‌టియు

కార్పొరేషన్ ఆగస్టు 5 ప్రభాతవార్త

ఖమ్మం నగరంలోని వివిధ షాపులలో పనిచేస్తున్న సిమెంట్ హమాలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వారి కూలీ వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య నగర అధ్యక్షులు కంకణాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం బైపాస్‌రోడ్డు నుండి ఆర్డీఓ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రామయ్య, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండు సవత్సరాల క్రితం ఒప్పందం చేసుకున్న ప్రకారం జులై 31తో ముగిసిపోయిందని వెంటనే కొత్త రేట్లు పెంచాలని దాదాపు 15 రోజుల నుండి సిమెంట్‌షాప్ యజమానుకు విజ్ఞప్తి చేస్తున్నామని




ఇప్పటికైనా యజమానులు ముందుకు వచ్చి సిమెంటు హమాలలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వెంటనే వారి కూలీ రేట్లు పెంచాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా ఈ స్థితిలో కార్మికుల యొక్క కొనుగోలు శక్తి తరిగిపోతున్న పరిస్థితి ఉందని విమర్శించారు. ఇప్పట ికైనా యజమానులు ముందుకు వచ్చి ధరలను దృష్టిలో ఉంచుకొని వారి వేతనాలు పెంచాలని అన్నారు. లేని ఎడల పెద్దఎత్తున ఆందోళన చేస్తామని వారు పిలుపు నిచ్చారు. హమాలీ సంఘం నాయకులు జి.రాంబాబు, జె.రాంబాబు, లక్ష్మయ్య, వీరబాబు, హనుమంతరావు, వీరభద్రం, జాంగీర్, బాబు, అర్జున్, అరవింద్, లింగయ్య, ప్రసాద్, భారీ వెంకన్న, రామారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరుపక్షాల విజయమే లోక్‌అదాలత్ ధ్యేయం

ప్రభాతవార్త ఖమ్మం ఆగస్టు 5

ఇరుపక్షాల విజయమే లోక్ అదాలత్ ధ్యేయమని, వివాదంలో ఉన్న ఇరుపక్షాలకు విజయం చేకూర్చే వేదిక లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశం ఆయన మాట్లాడుతూ ఈనెల 13న ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో 5 క్రిమినల్ కేసులు, 13వేల పెట్టి కేసులను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పోలీసు, న్యాయవాదులు, బీమా కంపెనీలు సహకారం అందిస్తున్నారన్నారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన అఖిలభారత జిల్లా సేవాధికార సంస్థల సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి సైతం లోక్‌అదాలత్ ప్రాముఖ్యతను వివరించావలన్నారు. భారత సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు విచారణ, ముద్దాయిల సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎక్కువకాలం జైలులో ఉన్న విచారణ ఖైదీల విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. పాత్రికేయుల సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ న్యాయమూర్తి మహ్మద్ జావీద్‌పాషా, న్యాయవాదులు ఇమ్మడి లక్ష్మీనారాయణ, జీవీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితకంటి పరీక్షా శిబిరాన్ని ప్రారంభించిన మేయర్

కార్పొరేషన్ ఆగస్టు 5 ప్రభాతవార్త

ఖమ్మం నగర కార్పొరేషన్ పరిధిలోని 37వ డివిజన్‌లో షాదీఖానాలో శుక్రవారం డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా ఆధ్వర్యంలో శరత్ మ్యాక్స్ విజన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నగర మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. అనంతరం సుడా ఛైర్మన్ బచ్చువిజయ్‌కుమార్‌తో కలిసి పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన యంత్రపరికరాల పనితీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్



క్లైమెంట్, సుడా డైరెక్టర్ ముక్తార్ షేక్, షాదీఖానా ఛైర్మన్ మజీద్, షాదీఖానా డైరెక్టర్లు ముజాహిద్, సలీమ్, మహ్మముదా మస్తాన్, అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి, గీతాభవాని, డివిజన్ జవాన్ ఫణి, జిల్లా మైనార్టీ నాయకులు షమ్ము, సమద్, అజమ్, ఫిరోజ్, షఫీ, నిర్వాహకులు విక్రమ్‌సింగ్, లావణ్య పాల్గొన్నారు.




## తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం

**- మణుగూరు సీడీపీవో పి.జయలక్ష్మి**

*మణుగూరు, ప్రభాతవార్త, ఆగష్టు05:*



ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో జయలక్ష్మి

పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని మణుగూరు సీడీపీవో పి.జయలక్ష్మి అన్నారు. ప్రపంచ అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామానుజవరం సెక్టార్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పిల్లలు ముర్రు పాలు తాగడం వలన వారిలో వ్యాధినిరోధకశక్తి విటమిన్ ఏ, ఇనుము, మాంసకృతులు సమృద్ధిగా లభిస్తాయన్నారు. పిల్లల్లో తెలివితేటలు కూడా పెరుగుతాయన్నారు. 6నెలలవరకు పిల్లలకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం కేటగిరీ వైజ్‌గా పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, పుష్పరాణి, కనకదుర్గ, శ్రావణి, స్వర్ణలత, సైదమ్మ, సునిత, నర్సమ్మ, దుర్గ, రమీజ, సరస్వతి, కౌసల్య, రాణి, జ్యోతి, భవాని, కమల, విజయలక్ష్మి, వెంకటరమణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీలు హోమ్ డెలివరీ

**- మణుగూరు కార్గో డీఎంఈ సైదులు**

*మణుగూరు, ప్రభాతవార్త, ఆగష్టు05:*

రక్షాబంధన్ పండుగ సందర్భంగా ఆడబిడ్డలు నేరుగా తమ అన్నదమ్ములకు రాఖీ కట్టలేని సందర్భంలో ఆర్టీసీ కార్గో సేవలను ఉపయోగించుకోవచ్చునని మణుగూరు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్(డీఎంఈ) బి.సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్షాబంధన్ పండుగకు ఆర్టీసీ కార్గోలో రాఖీలను బుక్ చేసుకోవచ్చని, రాఖీలు 24గంటల్లో గమ్యస్థానాలకు చేరే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నా మన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలలో ఎంపిక చేయబడిన ప్రదేశాలలో హోమ్‌డెలివరీ సైతం అందజేయను న్నామన్నారు. ఆడబిడ్డలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## విఆర్ఏల న్యాయమైన కోరికలు పరిష్కరించాలి

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త:*

గత కొన్ని రోజులుగా విఆర్ఏలు చేస్తున్న సమ్మెకు సీపీయం పార్టీ లక్ష్మీనగరం శాఖ, దుమ్ముగూడెం శాఖ కమిటీ సభ్యులు శుక్రవారం సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. దుమ్ముగూడెం మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గత కొన్ని రోజులుగా విఆర్ఏలు చేస్తున్న సమ్మె శిభిరాన్ని వారు సందర్శించి విఆర్ఏలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనగరం గ్రామపంచాయతీ సర్పంచ్ సరియం రాజమ్మ, ఉపసర్పంచ్ గుడ్ల రామ్మోహన్‌రెడ్డి, దుమ్ముగూడెం శాఖ సహాయ కార్యదర్శి ఎస్కె హుస్సేన్ అహ్మద్ మాట్లాడుతూ .. విఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని విఆర్ఏలు గ్రామాలలో చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం వారికి మంచి జరిగేలా ప్రకటన చేసి సమ్మెను విరమింప చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీయం పార్టీ సభ్యులు రామిశెట్టి కనకరాజు, గడ్డం సతీష్, తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరులో కాంగ్రెస్ మహాధర్నా

*మణుగూరు, ప్రభాతవార్త, ఆగష్టు05:*

ఏఐసీసీ పిలుపుమేరకు మణుగూరు మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు రోడ్డుబైఠాయించి పెరిగిన నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజీల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మణుగూరు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు గురిజాల గోపి, పినపాక నియోజకవర్గ యువజన నాయకులు బట్టా విజయ్‌గాంధీలు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం నిత్యావసరాల ధరలు పెంచి నిరుపేదలపై అధికధరల భారంమోపుతుందన్నారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించకుంటే పెద్దఎత్తున కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జానపాటి వేణు, మండల వైస్ ప్రెసిడెంట్ కంప రవి, ఎస్టీసెల్ అధ్యక్షులు కొమరం రామ్మూర్తి, బీసీసెల్ అధ్యక్షులు పొడెం సాంబశివరావు, ఎస్సీసెల్ అధ్యక్షులు వావిలాల నర్సయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ.షరీఫ్, పాల్వంచ రాములు, బూర్గుల నర్సయ్య, ఎండీ.షకీల్, తెల్లం నర్సింహారావు, శేఖర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## ముంపు బాధితులకు బియ్యం,నిత్యావసరాలు పంపిణీ

*అశ్వాపురం,ఆగష్టు05,ప్రభాతవార్త.*



రాజ్యసభసభ్యులు బండి పార్థసారధిరెడ్డి,ప్రభుత్వవిప్ రేగా కాంతారావు సహకారంతో గోదావరి వరదల ముంపుకు గురైన నెల్లిపాకబంజర,టేకులగుట్టకు చెందిన 350మంది బాధితులకు శుక్రవారం టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో బియ్యం,నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమరేందర్ మాట్లాడుతూ ముంపు బాధితులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని, కేసీఆర్ ఇచ్చిన హామీమేరకు బాధితుల ఖాతాలలో 10వేల రూపాయలు జమ అవుతున్నాయని తెలిపారు. వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం,పార్టీ సీనియర్ నాయకులు జాలె రామకృష్ణారెడ్డి, పినపాక నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు వెన్నా అశోక్‌కుమార్, నెల్లిపాకబంజర సర్పంచ్ గొర్రెముచ్చు వెంకటరమణ, ఎంపీటీసీ గాదె జయ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గొర్రెముచ్చు వెంకటరమణ,యువజన విభాగం ప్రచార కార్యదర్శి జూపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యుఎస్ ఎన్నికలలో టీఎన్‌టీయూసీ -బీఎంఎస్ కూటమి ఘనవిజయం

*అశ్వాపురం,ఆగష్టు05,ప్రభాతవార్త.*




మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగులు నివాసంవుండే గౌతమీనగర్ కాలనీలో జరిగిన రెసిడెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలలో ఐఎన్‌టీయూసీ, టీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ కూటమిపై టీఎన్‌టీయూసీ బీఎంఎస్ కూటమి ఘనవిజయం సాధించింది. అధ్యక్షులుగా జీఎం కొనసాగే, ఈ సొసైటీకి ఉపాధ్యక్షులుగా ఎం లక్ష్మణ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా వై అజయ్‌కుమార్,(స్పోర్ట్స్ అండ్ గేమ్స్)జాయింట్ సెక్రటరీగా కందుల శ్రీనివాసరావు, ఎం వి రమణ, జాయింట్ సెక్రటరీగా (కల్చరల్ అండ్ రిక్రియేషన్)మిరియాల హుస్సేన్, జనరల్ సెక్రటరీగా (మ్యాగజైన్ క్లబ్)కొల్లు వరప్రసాద్, జాయింట్ సెక్రటరీ(ఎడ్యుకేషన్)జ్ఞాన్ ప్రకాష్ గుప్తా, జాయింట్ సెక్రటరీ (సూపర్ అన్యుటేషన్ ఫంక్షన్)బి రాంబాబు ఘన విజయం సాధించారు. గతంలో జరిగిన గ్యాస్ సొసైటీ ఎన్నికలలో టీఎన్‌టీయూసీ బీఎంఎస్ కూటమి ఘనవిజయం సాధించిన విషయం పాఠకులకు విధితమే. రానున్న ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో విజయం సాధించేందుకు టీఎన్‌టీయూసీ బీఎంఎస్ కూటములు బాటలు వేస్తున్నారు. బారజల కర్మాగారంలో ఎలాంటి ఎన్నికలు జరిగినా కూరపాటి శ్రీనివాసరావు కృషి మరువలేనిదని పలువురు అభినందించారు.

## ఇద్దరు ముద్దాయిలకు జీవిత ఖైదీ

*భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :*

భద్రాచలం అబ్కారీ శాఖ వారి ఆధ్వర్యంలో 2018వ సంవత్సరం ఫిబ్రవరి 7వ తారీఖున భద్రాచలం నందు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన బానోతు దేవాను, కొమరంభీం జిల్లాకు చెందిన గుమ్మడి రమేష్‌లను పట్టుకుని వారిపై భద్రాచలం ఎక్సైజ్ శాఖ వారు కేసు నమోదు చేసి కొత్తగూడెం జిల్లా కోర్టుకు హాజరు పరచడం జరిగింది. ఇట్టి కేసుపై నాలుగు సంవత్సరాల పాటు విచారణ జరిగిన అనంతరం జిల్లా న్యాయమూర్తి శ్యాంశ్రీ ఆధ్వర్యంలో ఈ ఇద్దరి ముద్దాయిలకు 14 సంవత్సరాలు జైలు శిక్ష మరియు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పడం జరిగింది. ఈ కేసులో ప్రభుత్వ న్యాయవాది రామారావు ఆబ్కారీ శాఖ తరుపున వాదించారు.

# సమరశీల పోరాటాలు నిర్వహించాలి

**- సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య**

*మణుగూరు, ప్రభాతవార్త, ఆగష్టు05:*

బోడేపూడి వెంకటేశ్వరరావు, దంతులూరి నర్సింహరాజు ఆశయాల సాధనకై సమరశీల పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు, సీపీఎం రాష్ట్ర నాయకులు బోడేపూడి వెంకటేశ్వరరావు, కామ్రేడ్ దంతులూరి నర్సింహరాజుల వర్ధంతి సభలలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కంటే ముందే సమగ్రసాగునీటి పథకాలపై పోరాటాలు చేసి సాధించిన ఘనత బోడేపూడిదేనన్నారు. ఆయన నాయకత్వంలో రైతు ఉద్యమాలు బలంగా నిర్వహించారన్నారు. పినపాక నియోజకవర్గంలో దంతులూరి నర్సింహరాజు అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. కేంద్రప్రభుత్వం మతంపేరుతో పాసిస్టు విధానాలను అమలుచేస్తుందన్నారు. అధికధరలతో ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు. పెరిగిన ధరలను తగ్గించాలని, పేదలకు ఇళ్లస్థలాల సాధనకై ఉద్య మాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ నాయకులు కొడిశాల రాములు, గద్దల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, పాయం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



# ఇద్దరు వ్యక్తులకు 14 సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష

*కొత్తగూడెం లీగల్, ఆగష్టు 5 - ప్రభాతవార్త:*

గంజాయి తరలించిన ఇద్దరు వ్యక్తులకు 14 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శ్యాంశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి... 2018 ఏప్రిల్ 7న అసిస్టెంట్ ప్రొవిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హైదరాబాద్ ఆదేశాల మేరకు ఖచ్చితమైన సమాచారం మేరకు భద్రాచలం బ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండటంతో బొలోరే వాహనంలో ఇద్దరు వ్యక్తులు మహబూబాబాద్ జిల్లా కొరవి మండలం జుజ్జూరుతండా గ్రామస్తులు బానోత్‌దేవ, కొమరంభీం జిల్లాకు చెందిన గుమ్మడి రమేష్‌లు గంజాయి ప్యాకెట్లు రెండు కిలోల చొప్పున 200 ప్యాకెట్లు మొత్తం 400 కేజీల గంజాయి తరలిస్తుండగా వారిని అడ్డుకొని పంచనామా ద్వారా వాటిని స్వాధీన పర్చుకున్నారు. దర్యాప్తు అనంతరం భద్రాచలం ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.జయశ్రీ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చశారు. కోర్టులో సాక్షుల విచారణ అనంతరం దేవా, రమేష్‌లపై నేరం రుజువు కావడంతో 14 సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

# విఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

*కాటారం, ఆగష్టు 5, ప్రభాతవార్త*

విఆర్‌ఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని ఏఐసిసి కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కాటారం మండలకేంద్రంలో విఆర్‌ఏల నిరవధిక దీక్ష వద్దకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..టిఆర్ఎస్ అస్థవ్యస్థ పరిపాలనలో రెవెన్యూ వ్యవస్థను ఆగమాగం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని విఆర్‌ఏలు అడిగే న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. విఆర్‌ఏలకు అండగా నిలబడాల్సిన బాధ్యత టిఆర్ఎస్ ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విఆర్‌ఏలు ముందుండి నిలబడి పోరాటం చేశారన్నారు. విఆర్‌ఏలు సుమారు 99శాతం దళిత, బలహీన వర్గాలకు సంబంధించిన వారే ఉన్నారన్నారు. విఆర్‌ఏల న్యాయమైె పరమైన డిమాండ్ల విషయంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. అనంతరం కాటారం, గారెపల్లి గ్రామాల్లో ఇటీవలె మరణించిన పలు కుటుంబాలను శ్రీధర్‌బాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. డిసిసి అధ్యక్షుడు ఐత ప్రకాష్ రెడ్డి, కాటారం ఎంపిపి పంతకాని సమ్మయ్య, ఎంపిటీసీలు మహేష్ రవీందర్ రావు, జాడీ మహేశ్వరి-రమేష్, డిసిసి ఉపాధ్యక్షుడు ఉన్నారు.

# పేద ప్రజలకు అండగా కేసిఆర్

**-మండలంలో రూ.10వేల చొప్పున పరిహచం అందజేత**

**-కేసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన జవ్వాజి తిరుపతి**

*పలిమెల, ఆగష్టు 5, ప్రభాతవార్త*



గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా గోదావరి ఉప్పొంగి వరదలు వచ్చి పంటలు దెబ్బతిని పలిమెల మండలంలోని గ్రామాలు ముంపునకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వం ముందు చూపుతో గ్రహించి అధికారులు ఎటువంటి ప్రాణనష్టం జరుగుకుండా అందరిని అలెర్ట్ చేశారు. పేద ప్రజలు నిరాశ్రయులైన వారిని గుర్తించి పిఎం కేసిఆర్ పలిమెల మండలం మొత్తాన్ని ముంపు మండలంగా ప్రకటించి ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి సర్వే చేయవలసిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఉన్న ప్రతి కుటుంబానికి రూ.10వేలు వచ్చే విధంగా నివేదిక తయారు చేసి అధికారులు ప్రభుత్వానికి పంపించారు. దీంతో ప్రభుత్వం వెంటనే నిరాశ్రయులైన వారి ఖాతాల్లో రూ.10వేల చొప్పున జమ చేసి కేసిఆర్ పేద బడుగుల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. ఈసందర్భంగా పలిమెల మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి మాట్లాడుతూ..వరివారం అందేలా చూసిన సిఎం కేసిఆర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి పలిమెల మండల ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో టిఆర్ఎస్ పార్టీని, కేసిఆర్ నాయకత్వాన్ని బలపర్చవలసిన అవసరం ఉందని పలిమెల మండల ప్రజలను కోరారు.

# నేరాలు-దారుణాలు

## సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

*కొత్తగూడెం క్రైం, ఆగష్టు 5 - ప్రభాతవార్త:*

రామవరం ఎస్‌సీబీ నగర్‌లో నివాసముంటున్న సింగరేణి కార్మికుడు కిరణ్‌కుమార్ ఇంట్లో చోరీ జరిగినట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిరణ్‌కుమార్ ఈ నెల ఒకటో తేదీన మధిరలోని తమ బంధువుల ఇంట్లో కర్మలకు హాజరయ్యారు. కుటుంబ సమేతంగా తిరిగి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చారు. అప్పటికే తలుపులు పగలగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రెండు లక్షల నగదుతో పాటు 14 తులాల బంగారం ఆభరణాలు తొమ్మిది తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసిన ఎంపిఓ

*మహాముత్తారం, ఆగష్టు 5, ప్రభాతవార్త*



మహాముత్తారం మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీలో శుక్రవారం పారిశుద్ధ్య పనులను మండల పంచాయతీ అధికారి ఆర్.ఉపేంద్రయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో వాటర్ ట్యాంక్ శుభ్రపరుచడాన్ని మరియు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించడం తదితర పనులను క్షేత్రసాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బూసి దేవేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గనపాక కిషోర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# దోమల నియంత్రణకు ములుగుపల్లిలో ఫాగింగ్

*మహాముత్తారం, ఆగష్టు 5, ప్రభాతవార్త*



దోమల నియంత్రణ కోసం మహాముత్తారం మండలంలోని ములుగుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం సర్పంచ్ దూలం మల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మల్లయ్య గౌడ్ మాట్లాడుతూ..గ్రామంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెడిపోయిన వస్తువులు, కూలర్లు, టెంకాయలు మొదలగు వంటి వాటిని ఇంటి పరిసరాల్లో ఉంచరాదని, దీంతో దోమల వ్యాప్తి అధికమై ప్రజలు అనారోగ్యం భారిన పడే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్క కుటుంబ సభ్యులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్థానికులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పలిమెలలో ఫ్రైడే..డ్రైడే

*పలిమెల, ఆగష్టు 5, ప్రభాతవార్త*



పలిమెల గ్రామ పంచాయతీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని అన్ని వార్డులలో చెత్తను తొలగింపజేశారు. అదేవిధంగా డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్ట్ చేశారు. వర్షాకాలంలో వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వేడి వేడి అన్నంను ఆహారంగా తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

*కాటారం, ఆగష్టు 5, ప్రభాతవార్త*



కాటారం మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఏఐసిసి కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం అందజేయడం జరిగిందని కాటారం ఎంపిపి పంతకాని సమ్మయ్య తెలిపారు. చింతకాని గ్రామానికి చెందిన నిడిగొండ సత్యనారాయణకు రూ.60వేలు, జాదరావుపేటకు చెందిన జాకని నరేందర్‌కు రూ.53వేలు, అంకుషాపూర్‌కు చెందిన గుంటి పోచయ్యకు రూ.9వేలు, గంగారంకు చెందిన తెప్పెల సరోజనకు రూ.40,500లు, గంట్లకుంటకు చెందిన అజ్మీర శ్రీకాంత్‌కు రూ.60వేలు, పోతుల్వాయికి చెందిన కొత్త అరుణ్‌కు రూ.42వేలు మంజూరు కాగా వారికి చెక్కులను అందజేసినట్లు ఎంపిపి సమ్మయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో వారితో పాటు ధన్వాడ మాజీ ఎంపిటీసీ కుమ్మరి అశోక్, కాంగ్రెస్ నాయకులు కుంభం రమేష్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

*పలిమెల, ఆగష్టు 5, ప్రభాతవార్త*



పలిమెల మండలం వెంచంపల్లి ప్రాథమిక పాఠశాలలో నోట్ పుస్తకాలు లేకుండా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి తెలుపగా గారెపల్లికి చెందిన శ్రీ శ్రీనివాస ప్రింటింగ్ ప్రెస్ యజమాని పడకంటా అంజలి-ప్రకాష్ గుప్తా స్పందించి, పాఠశాలలో ఒకటి నుండి అయిదవ తరగతి వరకు చదువుతున్న సుమారు 21మంది విద్యార్థులకు 4రకాల నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌లు సర్పంచ్ నరేష్ చేతుల మీదుగా అందజేశారు. సకాలంలో స్పందించి నోట్‌బుక్స్ అందజేసిన పడకంటి అంజలి-ప్రకాష్, విద్యార్థుల ఇబ్బందులను ప్రకాష్ దృష్టికి తెచ్చిన కాటారంకు చెందిన నెలరేడు, ప్రధానోపాధ్యాయుడు చిరంజీవికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న ఎంపిపి

*మహదేవపూర్, ఆగష్టు 5, ప్రభాతవార్త*



శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతంను పురస్కరించుకొని మహదేవపూర్ ఎంపిపి బన్సోడ రాణిబాయి-రామారావు మహదేవపూర్ మండలకేంద్రంలోని రామాలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని నోముకొని ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఈసందర్భంగా మండల ప్రజలు పాడి పంటలతో, సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఎంపిపి ప్రకటించారు. ఈఅధ్యాత్మిక కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు మరియు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు

# ఆలయాల్లో మహిళల ప్రత్యేక పూజలు

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

శ్రావణ మాస వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని అశ్వారావుపేట మండల వ్యాప్తంగా మహిళలు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మహిళలు ఇళ్ళవద్ద భక్తిప్రపత్తులతో వరలక్ష్మి వ్రతాలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రం అశ్వారావుపేటలోని శ్రీ వాసవి



కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో, విఘ్నేశ్వర ఆలయంలో, గ్రామ దేవత ముత్యాలమ్మ, శ్రీ కనకదుర్గ ఆలయం, కోటమైసమ్మ ఆలయంతో పాటు మండలంలోని వినాయకపురం చిలకలగండి ముత్యాలమ్మ, గుర్రాలచెర్వు కనకదుర్గ ఆలయం, నారాయణపురం కట్టమైసమ్మ ఆలయాల్లో తెల్లవారుఝాము నుండి మహిళలు అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అష్టలక్ష్మి అమ్మవార్లకు మహిళలు కుంకుమ పూజలు, అభిషేకాలు, లలిత సహస్రనామార్చనలు జరిపారు.



## శుభలేఖలు, గడియారాలు పంపిణీ

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త:**

మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో జరగబోయే వివాహానికి సంబంధించి రిసెప్షన్ ఆహ్వాన శుభలేఖలను, గడియారాలను మండల తెరాస నాయకులు శుక్రవారం పలువురికి పంపిణీ చేశారు. మండల పరిధిలోని జమ్మిగూడెం గ్రామ పంచాయతీలో పర్యటించిన మండల రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ జూపల్లి రమేష్, ఎంపిపి జల్లిపల్లి శ్రీరామమూర్తి తదితరులు పొంగులేటి కుమార్తె స్వప్నిరెడ్డి వివాహానికి సంబంధించి ఈనెల 17న జరగబోయే రిసెప్షన్ యొక్క ఆహ్వాన పత్రిక, గడియారాలను పలువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూర్య ప్రభావతి, జూపల్లి ప్రమోద్, కృష్ణ, జగపతి, కొండయ్య, అల్లాడి రామారావు, పెన్నాడ ఏసు, తెరాస కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వాసవి అమ్మవారికి బంగారు హారం బహుకరణ

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త:**

మండల కేంద్రం అశ్వారావుపేటలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన అమ్మవారికి భక్తులు బంగారంతో చేసిన హారంను బహుకరించడం జరిగింది. అశ్వారావుపేటకు చెందిన వంటిపల్లి రాజేశ్వరరావు-విష్ణుమాంబల కుటుంబ సభ్యులు మరియు ఏలూరుకు చెందిన నంగులూరి లక్ష్మినర్సింహారావు-జ్యోతి కుటుంబ సభ్యుల సహకారంతో తయారు చేసిన బంగారు హారంను దేవస్థానంలో సమర్పించడం జరిగింది. ఈ మేరకు అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల ఉమామహేశ్వరరావు-భాస్కరలక్ష్మి దంపతులు, వంటిపల్లి హర్షవర్ధన్-అనూష దంపతులు మరియు దేవస్థాన అధ్యక్షులు ముత్తా సుమాకర్, రామకృష్ణ, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వరలక్ష్మి వ్రతాలు

**దమ్మపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త**

మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే శ్రావణమాస వరలక్ష్మి వ్రతాలను శుక్రవారం దమ్మపేట మండల వ్యాప్తంగా మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో మహిళలు ఇంటివద్ద అమ్మవారికి ఆహ్వానం పలుకుతూ ప్రత్యేక అలంకరణలు, పిండి వంటలు, వివిధరకాల ఫలాలతో పూజలు జరిపారు. అనంతరం చుట్టుపక్కల వారికి వాయినాలు అందజేసుకున్నారు. ఈ క్రమంలో స్థానిక గాయత్రీ ఆశ్రమంలో, వేణుగోపాలస్వామి ఆలయం, శివాలయం, శిరిడిసాయిబాబ ఆలయం, ఆంజనేయస్వామి దేవాలయాల్లో మహిళలు విశేష పూజలు జరుపుకున్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి - డి.యం హెచ్.ఓ

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 05, ప్రభాతవార్త**

వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి బారీన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి దయానందస్వామి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఒడ్డుగూడెం గ్రామంలోయర్రగుంట ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలనుశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాల బారీన పడితే స్థానిక ఆశాలకు సమాచారం ఇచ్చి ప్రభుత్వ అందించే ఉచిత వైద్యసేవలు పొందాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని, గిరిజన బాలికల వసతి గృమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై పలు సూచనలు చేశారు. డి.యం హెచ్.ఓవెంట మండల వైద్యాధికారి ప్రియాంక, వైద్య సిబ్బంది ఉన్నారు.






## నిషేదిత గుట్కా ప్యాకెట్లు సీజ్

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 05, ప్రభాతవార్త**

విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి మండల పరిధిలోని రాజాపుర ం, శాంతి నగర్ గ్రామాలలో కిరాణా దుఖాణాలపై దాడులు నిర్వహించి సుమారు 29 వేల రూపాయల గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసినట్లు యస్.ఐవిజయ తెలియజేశారు.

## సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కారేపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త**

మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమార్తె వివాహ సందర్భంగా



మండల తెరాస ఉపాద్యక్షురాలు పప్పుల నిర్మల ఆద్వర్యంలో గురవమ్మ తల్లి, ఆంజనేయస్వామి, సత్యనారాయణస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు వివాహ పత్రికతో పాటు గడియారాలను ప్రజలకు పంపిణీ చేసారు ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి వారి ఆలయ చైర్మన్ మల్లెల నాగేశ్వరరావు, గురవమ్మతల్లి ఆలయ చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు, పప్పుల ప్రవీణ్, వెంకటరెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**కారేపల్లి, ఆగష్టు 5, ప్రభాతవార్త**

బారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని నకిలీ ఎరువుల విత్తనాలను నియంత్రించాలని ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు బోగి బద్రయ్య, స్వర్ణపాక లక్ష్మీనర్సు అన్నారు.కారేపల్లిలో శుక్రవారం




ఎఐకెఎంఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 10న కారేపల్లిలో ఎఐకెఎంఎస ఖమ్మం డివిజన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతుకూలీ సమస్యల పరిష్కారం కోసం అనేక సమస్యలు పరిష్కరిచామని పోడు సమస్యలు నిరుపేదలకు బూములు దక్కేలా కృషి చేసామన్నారు. జనరల్ బాడీ సమావేశానికి మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య, ఆవుల వెంకటేశ్వర్లు,గుమ్మడి సందీప్ పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలు, వేములపల్లి వీరన్న, చల్లారాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నాం

## జమామసీదు అద్యక్షులుగా షేక్ మునీరుద్దీన్‌పటేల్

**కారేపల్లి, ఆగష్టు 5, ప్రభాతవార్త**

కారేపల్లి జమా మసీదు నూతన కమిటి అధ్యక్షులు షేక మునీరుద్దీన్ పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు ఎండి హనీఫ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ మజీద్‌పాషా తెలిపారు కారేపల్లిలో గల జమా మసీదులో శుక్రవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నట్లుచెప్పారు ఈ సమావేశంలో నూతన కమిటి అద్యక్షుడిగా మునీరుద్దీన్ పటేల్, షేక్ షఫీ, షేక్ యాకూబ్‌పాషా,యాకూబ్ ఆలీ, షేక్ సర్దార్, సహాయ కార్యదర్శి ఉద్దండ్‌ఖాన్, గౌరవ సలహాదారుగా షేక్ షంషుద్దీన్, కమిటి సబ్యులు షేక్ సయ్యద్ అజమాత్, జావీద్, సాహిద్‌లను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో షేక్ తాజుద్దీన్, షేక్ మతిన్ పటేల , ఫారూఖ్, ఎంఎ ఖాదీర్, షేక్ జానీ,పాల్గొన్నారు.

# అరుణ పతాకాలతో రెపరెపలాడిన వైరా పట్టణం

**డప్పువాయిద్యాలు, కోలాట నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణ**

**భారీ ర్యాలీతో పట్టణ ప్రజలను ఆకట్టుకున్న సిపిఐ శ్రేణులు**

వైరా,ఆగస్ట్05,ప్రభాతవార్త:

సిపిఐ జిల్లా 22వ మహాసభల సందర్భంగా పట్టణంలో సిపిఐ శ్రేణులు ఎర్రజెండాలతో కదం తొక్కాయి. దీంతో వైరా పట్టణం ఎర్రజెండాలతో అరుణమయంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ దేశంలో, రాష్ట్రంలో అవినీతి, నిరుద్యోగం భారీ ఎత్తున పెంచాయని, దీంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ఖమ్మం మాజీ శాసనసభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. మతోన్మాదాన్ని అడ్డంగా పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసిన మోడీ పెద్ద నియంత అని ఆయన అన్నారు. దేశంలో కోట్లాది మంది యువత నిరుద్యోగం బారిన పడి దేశంలో అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన అన్నారు. ఆదాని, అంబానీలకు, కార్పొరేట్ సంస్థలకు పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు శ్రామిక వర్గాలను గాలికి వదిలేసి పాలన చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. వీటి కోసమై సిపిఐ తమతో కలిసి వచ్చే వామపక్షాలు, లౌకికవాద శక్తులను సంఘటితపరిచి పోరాటం చేస్తుందని, తమ పార్టీ అగ్రభాగాన ఉండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని ఆయన అన్నారు. దేశంలో మహిళలకు, కార్మికుల భద్రత కరువైందని, మోడీ ప్రభుత్వం వీరిని గాలికొదిలేసి ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తూ ఆదాని, అంబానీలకు ఊడిగం చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలేశాయని విమర్శించారు. పార్లమెంటులో మోడీ ప్రభుత్వానికి అన్నివేళలా చట్టాలు చేయడానికి సహకరించిన కెసిఆర్ ఈ మధ్యకాలంలో బిజెపికి వ్యతిరేకంగా పోరాడతామని చెప్పడం గురివింద సామెత గుర్తుకు తెస్తుందని ఆయన అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.45వేల కోట్ల అప్పు ఉండగా, అది నేడు రూ.4లక్షల కోట్లకు చేరిందని, ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి ప్రజల కొనుగోలు శక్తిని హరింపజేసి ద్రవ్యోల్బణాన్ని పెంచిందని, దీనికి పాలకులు సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. జిల్లాలో ప్రజా సమస్యల పోరాటంలో తమ పార్టీ కీలకపాత్ర వహిస్తుందని ఆయన అన్నారు. కెసిఆర్ అధికారంలోకి రావడానికి దళితులకు మూడెకరాలు, పెన్షన్‌లు, రుణమాఫీ, రైతుబంధు హామీలు ఇచ్చారని, ఇప్పటివరకు మూడెకరాల భూమి గాని, కొత్త పెన్షన్‌లు గాని, రుణమాఫీ గాని జరగకపోవడం ఆయన పరిపాలనను ఎత్తిచూపుతుందని ఆయన దుయ్యబట్టారు. అలాగే గత ఎన్నికల్లో తమ పార్టీ కాంగ్రేస్ పార్టీతో పొత్తు పెట్టుకొని మధిర, పినపాక, పాలేరు, కొత్తగూడెం, భద్రాచలం అసెంబ్లీ స్థానాల్లో పూర్తి మద్దతు ఇచ్చి కాంగ్రేస్ పార్టీ అభ్యర్థులను గెలిపించామని, వైరాలో కాంగ్రేస్ పార్టీ పొత్తుతో సిపిఐ పార్టీ పోటీ చేసిందని, కాంగ్రేస్ శ్రేణులు అమ్ముడుపోయి మా పార్టీ అభ్యర్థిని ఓడించారని ఆయన దుయ్యబట్టారు. ప్రజా సమస్యలకై తమతో కలిసొచ్చే పార్టీలతో ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని, దానికి మద్దతు అవసరం అని ఆయన అభ్యర్ధించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో చెలగాటమాడకుండా మతోన్మాదాన్ని ప్రక్కన పెట్టి ప్రజాస్వామ్యబద్ధంగా పాలన కొనసాగించాలని ఆయన తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ వలసలను అన్ని పార్టీల నుండి ప్రోత్సహిస్తూ వారి ఉనికికే ప్రమాదం కొని తెచ్చుకున్నారని, రాబోయే కాలంలో ప్రజలు టిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ షాబీర్ పాషా, రావులపల్లి రాంప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించగా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సింగు నర్సింహారావు, యర్రా బాబు, పోటు కళావతి, సిహెచ్.సీతామహాలక్ష్మి, బిజి క్లైమేట్, షేక్ జానిమియా, అజ్మీర్ రామ్మూర్తి, సిద్ధినేని కరుణకుమార్, కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వరరావు, ఆహ్వాన సంఘ కార్యదర్శి దొండపాటి రమేష్, గౌరవ అధ్యక్షులు అడపా రామకోటయ్య, సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, బానోతు విజయబాయి, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నాలబాల రామక్రిష్ణ, ఇటికల రామక్రిష్ణ పాల్గొన్నారు.






## వైరాలో సిపిఐ భారీ ప్రదర్శన

వైరా,ఆగస్ట్05,ప్రభాతవార్త:

వైరాలో సిపిఐ భారీ ప్రదర్శన నిర్వహించింది. భారతీ కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా 22వ మహాసభల సందర్భంగా శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన సిపిఐ కార్యకర్తలు స్థానిక పరుచూరి గార్డెన్స్ నుంచి బహిరంగ సభాస్థలి వరకు వైరా రింగు రోడ్డు సెంటర్ వరకు భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అగ్రభాగాన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ షాబీర్‌పాషా, రావులపల్లి రాంప్రసాద్ తదితరులు ముందుండి ప్రదర్శన నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ చేపట్టిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. మహిళలు కోలాట నృత్యాలు నిర్వహించారు. జిల్లా మహాసభలు రెండు రోజులపాటు వైరాలోని టివి.చౌదరి నగర్(ఎన్‌విఎస్ గార్డెన్స్‌లో)లో జరగనున్నాయి. 7500 మంది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వమఇస్తూ 600మంది ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొననున్నారు. ఖమ్మంలోని నల్లమల గిరిప్రసాద్ స్మారక స్థూపం నుంచి తీసుకొచ్చిన అమరజ్యోతిని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు పువ్వాడ నాగేశ్వరరావు, సాంబశివరావులకు అందజేశారు. చింతకాని మండలం రాఘవాపురం గ్రామం నుంచి వచ్చిన మడత ప్రభ విశేషంగా ఆకర్షించింది. వైరాలో నిర్వహించిన బహిరంగ సభకు సిపిఐ కార్యకర్తలంతా ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలతో ప్రదర్శన అరుణ వర్ణాన్ని పలుముకుంది.



## ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా చూడాలి: కౌన్సిలర్ సునీత

**వైరా,ఆగస్ట్05,ప్రభాతవార్త:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో కౌన్సిలర్ మదినేని సునీత మున్సిపాల్ సిబ్బందితో కలిసి శుక్రవారం డ్రైడేను వార్డులో నిర్వహించారు. ఈ సందర్భగా వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలు ఆ పరిశుభ్రత కారణంగా దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున కొబ్బరి బోండాలు, పాత టైర్‌లు, కూలర్‌లలో నిల్వ ఉండే నీటి ద్వారా దోమలు వ్యాప్తి చెందుతాయని, వెంనే వాటిని తొలగించాలని వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. సిబ్బందితో కలిసి వార్డులో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. వార్డులో ఉన్న ఖాళీ స్థలల్లో నీరు నిల్వకుండా చూడాలని, స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని ప్లాట్ల యజమానులకు తెలియజేసి శుభ్రంగాం ఉండటేట్లు చూడాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం వార్డులో శ్రీషిరిడి సాయి మందిరం ప్రాంతంలో మురికి కాల్వలో ఆయిల్ స్ప్రే చేయించారు. ఇంటి పరిసర ప్రాంతాలు మనమే శుభ్రపరుచుకోవాలని, తడి, పొడి చెత్తలను మున్సిపాలిటీ సిబ్బందికి అందించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి డాక్టర్ బాబురావు, ఆర్‌పి నాగమణి, ఆశా వర్కర్ రేణుక, బిల్ కలెక్టర్ ప్రభాకర్, అంగన్‌వాడీ టీచర్ శారద, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.








## విఆర్ఏల పట్ల మొండిగా వ్యవహరిస్తే కెసిఆర్‌కే నష్టం

**సిపిఐ(ఎం) వైరా నియోజకవర్గ ఇంచార్జి భూక్యా వీరభద్రం**

వైరా,ఆగస్ట్05,ప్రభాతవార్త:

విఆర్ఏలకు గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితంగా నేడు విఆర్ఏలు



నిరవధిక సమ్మె చేస్తున్నారని, వెంటనే కెసిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేసి సమ్మెను విరమింపజేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, వైరా నియోజకవర్గ ఇంచార్జి భూక్యా వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12వ రోజు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు కొనసాగుతున్న విఆర్ఏల సమ్మెకు శునరకవారం సిపిఐ(ఎం) నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ విఆర్ఏ సమస్యలను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తే కెసిఆర్ ప్రభుత్వానికే నష్టమని, కెసిఆర్ స్పందించకపోతే విఆర్ఏల సమస్యను సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర రాకీయ ఏజెండాగా మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి కృష్ణారావు, చింతనిప్పు చలపతిరావు, గుడిమెట్ల మోహన్‌రావు, గొల్లపూడి ప్రకాశరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వరలక్ష్మీ వత్రాలు

కారేపల్లి, ఆగష్టు 5, ప్రభాతవార్త

మండల పరిధిలోని దేవాలయాలు, ఇళ్లలో శ్రావణ శుక్రవారం ఘనంగా





నిర్వహించారు మహిళలు తమ ఇళ్లలో ప్రత్యేక మండపాలు ఏర్పాటుచేసి కుటుంబసభ్యులతో అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు అదేవిధంగా కారేపల్లిలో గల పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి తెల్లవారుఝామునుండి పంచామృతాలతో అబిషేకం చేసారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించగా భక్తులకు ధనలక్ష్మీ రూపంలో దర్శనమిచ్చారు. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయానికి వచ్చి తీర్థ ప్రసాదాల స్వీకరించారు.

## పోకల వివాహ వేడుకల్లో పాల్గొన్న టూరిజం చైర్మన్

రఘునాథపల్లి, ఆగస్టు5, ప్రభాతవార్త:

తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా వరంగల్‌లోని ఓ వివాహ వేడుకకు హాజరయ్యే క్రమంలో శుక్రవారం జనగామ జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పోకల శివకుమార్ సోదరుని కుమార్తె వివాహం జరగగా ఆ వేడుకల్లో భాగంగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబోకే అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ కో-ఆర్డినేటర్ నామాల బుచ్చయ్య, తెరాస మండలపార్టీ అధ్యక్షుడు వారాల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి మూసికొట్ల విజయ్, మండల మహిళ అధ్యక్షురాలు తిప్పారపు మమత,ఉసర్పంచ్ రాములు, బచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎంఎల్‌ఏ సండ్ర

తల్లాడ, ఆగస్టు 5, ప్రభాతవార్త



తల్లాడ మండలం రెడ్డిగూడెంకు చెందిన బద్దం క్రిష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శు క్రవారం వారి కుటుంబాన్ని ఎంఎల ఏ సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన తాళ్లూరి అజిత అనారోగ్యంతో మరణించింది. ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ రెండు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొడ్డా శ్రీనివాసరావు, తెరాస మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహనరెడ్డి, వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ దూపాటి బద్రరాజు, సర్పంచ్ బద్దం నిర్మ, తెరాస పట్టణ అధ్యక్షులు జివిఆర్, తెరాస జోనల్ అధ్యక్షులు బద్దం కోటిరెడ్డి, సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, ఉపసర్పంచ్ వీరయ్య, తెరాస మండల సోషల్ మీడియా అధ్యక్షులు దూపాటి నరేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి బోడెపూడి

తల్లాడ, ఆగస్టు 5, ప్రభాతవార్త



తల్లాడ సిపిఎం ఆఫీసులో బోడెపూడి వెంకటేశ్వరరావు 25వ వర్ధంతి సభ జరిగింది ముందుగా బోడెపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ 3 పర్యాయాలు ఎంఎల్ఏగా ప్రజాసమస్యలను శాసనసభలో ప్రస్తావించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ శాసనసభ పక్ష నాయకుడిగా ప్రతి పక్ష పార్టీ నాయకులను సైతం ఆలోచింపచేసే అర్థవంతమైన చర్చ చేసారన్నారు కాల్వల వెంట తిరిగి రైతులకు నీళ్ల అందించే కృషి చేసారన్నారు సమస్యల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించారని, పార్టీ నిర్మాణంలోనూ రాష్ట్ర రైతాంగ రైతు సంఘ కార్యదర్శిగా విశేష సేవలు అందించారని, ఆయన మరణించి 25 సంవత్సరాలు గడిచిన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు సేలం సత్యనారాయణ, పులి కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, షేక్ నన్నే సాహెబ్, మన్నేపల్లి రామారావు, కళ్యాణపు కృష్ణయ్య, ఆదూరి జీవరత్నం, గండమాల ఆనందరావు, వంగూరి లోకేశ్వరరావు, చావా సతీష్, సాలిక సాకేత్, అమరపూడి భవాని, మూకర భూషయ్య, మేడి కృష్ణ, పామర్తి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంగ్రామ యాత్రను విజయవంతం చేయండి

### - బిజెపి జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

ప్రభాతవార్త, ప్రతినిధి, హన్మకొండ:

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ చేపట్టిన 3 విడత ప్రజా సంగ్రామ యాత్రను జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని హన్మకొండ బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి రావు పద్మ కోరారు. శుక్రవారం హన్మకొండ హంటర్ రోడ్‌లోని వేద బాంక్వెట్ హాలులో ప్రజా సంగ్రామ యాత్ర విజయవంతం కొరకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆగస్టు 2న యాదగిరి గుట్టలో ప్రారంభమైన యాత్ర సభతో ముగుస్తుందన్నారు. ఆ సభలో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుండి పలువురు నేతల చేరికలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, నాయకులు ప్రేమ్ రాజ్, వీరేందర్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, గురుమూర్తి శివకుమార్, కాచం గురుప్రసాద్, గుజ్జ సత్యనారాయణ, రత్నం, సతీష్ పాషా, దేశిని సదానందం గౌడ్, జయంత్ లాల్, రాజేశ్వరరావు, కొరబోయిన సాంబయ్య, తిరుపతి రెడ్డి, విజయ చందర్‌రెడ్డి, కుసుమ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితుల సహాయార్ధం నిత్యావసర సరుకులు పంపిణీ

తల్లాడ, ఆగస్టు 5, ప్రభాతవార్త



లయన్స్‌క్లబ సభ్యులు సరికొండ అప్పలరాజు కుటుంబం వరద బాధితుల సహాయార్థం 30వేల రూపాయల విలువ గల నిత్యావసర సరుకులు భద్రాచలం చుట్టుపక్కల గ్రామాల్లో పంపిణీ చేసారు. ఆయన తల్లి సరికొండ రమణమ్మ సేవా గుణాన్ని ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్‌క్లబ్ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, రీజనల్ చైర్‌పర్సన్ దారా శ్రీనివాసరావు, డిసి మిట్టపల్లి నరసింహారావు, డిసి పులబాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి వేమిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, గుంటుపల్లి వెంకటేశ్వరరావు, శీలం వెంకటరెడ్డి, , కటికి శ్రీకాంత్, పసుమర్తి కాశీవిశ్వనాథం,పాల్గొన్నారు

## ఆలయాల్లో భక్తుల సందడి

కరీంనగర్ కల్చరల్, ప్రభాతవార్త:



నగరంలోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. మహిళలు బారులు తీరి అమ్మవారిని దర్శించి ఒడిబియ్యం, గాజులు, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. కార్యక్రమంలో ఈవో నాగుల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## రాకేష్‌కు విద్యా ఫౌండేషన్ చేయూత

### - దాతలు ముందుకు రావాలి

### - చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ అనిల్ చందర్‌రావు

ప్రభాతవార్త, ప్రతినిధి, హన్మకొండ:



హన్మకొండలోని బాల్ రక్షాభవన్ కార్యాలయంలో పెసిడో మస్కులర్ డిస్ట్రోఫీ వ్యాధితో బాధపడుతున్న భీమదేవరపల్లి మండలం రంగయ్య పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి గూళ్ల రాకేష్‌కు శుక్రవారం విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమక్షంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్ పర్సన్ అన్నమనేని అనిల్‌చందర్ మాట్లాడుతూ చదువుపట్ల తనకున్న ఆసక్తి తనకు సహకరిస్తున్న తన తల్లి బాధకు స్పందించి ప్రభుత్వం మరియు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావడం చాలా సంతోషకరమైన విషయమని దాతలను అభినందించారు. అనంతరం బిల్ల మహేందర్ మాట్లాడుతూ రాకేష్ పరిస్థితి మరీ దయనీయంగా ఉందని అతన్ని ఆదుకునేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, జిల్లా బాలల పరిరక్షణాధికారి సంతోష్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, ఫౌండేషన్ ముఖ్య సలహాదారు గురిజాల తిరుపతి రెడ్డి, కార్యదర్శి కలకోట్ల నరేందర్, సభ్యులు ఉదయశ్రీ, ప్రభాకర్, గజ్జెల స్వరూపారాణి, ఎండీ రఫీ, విష్ణుమూర్తి, సమ్మయ్య, పాల్గొన్నారు.

# సత్తుపల్లి వార్త

## నూతన వధూవరులకు ఎమ్మెల్యే సండ్ర ఆశీస్సులు

కల్లూరు, ఆగస్టు 05, ప్రభాతవార్త



మండల పరిధిలోని ఓబులరావు బంజర్ గ్రామానికి చెందిన భూక్యా కృష్ణ, రుక్మిణి దంపతుల కుమార్తె వధువు ప్రమీల, వరుడు వెంకటేశ్వరరావుల వివాహ మహోత్సవంలో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిధిగా పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా మాన్సింగ్, యరమల సత్యనారాయణరెడ్డి, అజ్మీరా జమలయ్య, భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## నేడు కల్లూరులో గ్రామ సభ

కల్లూరు, ఆగస్టు 05, ప్రభాతవార్త

కల్లూరు గ్రామపంచాయితీ కార్యా లయం వద్ద శనివారం గ్రామ సభ నిర్వహించి, ఖాన్‌ఖాన్‌పేటలో నిర్మించిన 96 డబుల్ బెడ్రూం ఇళ్ళ కోసం చేసిన దరఖాస్తుల యొక్క అర్హులు, అనర్హుల జాబిత ప్రదర్శి స్తున్నట్లు తహశీల్దార్ జంగం బాబ్జి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆలయ స్థల, విగ్రహ దాతలకు సన్మానం

పెనుబల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త



మండల పరిధిలోని యడ్లబంజర్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ కోదండ రామాలయానికి స్థలాన్ని, విగ్రహాలను అందజేస్తున్న దాతలను శుక్రవారం ఆలయ కమిటీ సన్మానించింది. యడ్ల బంజర్ గ్రామానికి చెందిన గోపిశెట్టి సుబ్బారావు ఆలయ నిర్మాణానికి 5 కుంటల స్థలాన్ని విరాళంగా అందజేయగా, ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు కీ.శే. రామిశెట్టి నాగేశ్వరరావు, సత్యావతి దంపతుల కుమారుడు రామిశెట్టి రమేష్ ముందస్తుగా దేవతామూర్తుల విగ్రహాలకు రూ. 60 వేలను ఆలయ కమిటీకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జట్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, టీఆర్ఎస్ నాయకులు సోమరాజు సీతారామారావు, ఆలయ కమిటి యడ్ల సుబ్బారావు, తోట వెంకట రామారావు, తోట కిరణ్, జంపా వియన్నబాబు, గోపిశెట్టి లక్ష్మీనారాయణ, జంపా శ్రీనివాసరావు, గోపిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఎంసిపిఐయు జాతీయ సమావేశాలు

చెన్నారావుపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త



ఎంసిపిఐయు జాతీయ కమిటీ సమావేశాలు వరంగల్ పట్టణంలో నేటి నుండి మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగు తుందని ఆ పార్టీ మండల నాయ కుడు జన్ను రమేష్ అన్నారు. ఈ మేరకు చెన్నారావుపేటలో శుక్ర వారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టడమే లక్ష్యమన్నారు. ప్రజా ధనాన్ని కొల్లగొడుతూ కేంద్రం కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పులుకుతుందన్నారు. ఇలా ప్రజల పక్షాన నిలిచి సమస్యలపై పోరాటం చేయడమే ఎంసిపిఐయు లక్ష్యమన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి సమావేశాలకు వస్తున్నందున సమావేశాలను విజయవంతం చేయాలన్నారు.

# సుబ్లేడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయుటకు సహకరించండి

## మంత్రి కొప్పుల ఈశ్వర్‌కి వినతి



*తిరుమలాయపాలెం ఆగస్టు 5 ప్రభాతవార్త*

కాకతీయుల కాలం నుండి (రెవెన్యూ పిర్కా) పరిపాలన కేంద్రంగా ఉండి ఎంతో చరిత్ర కలిగిన సుబ్లేడు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ శుక్రవారం సుబ్లేడు మాజీ సర్పంచ్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మందడి ఇజ్రాయిల్ హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను వారి ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయ కులు మందాడి ఇంజ్రాయిల్ మాట్లాడుతూ నిజాం ప్రభుత్వం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పత్రికా రంగాన్ని ఎంచుకుని పోరాటం కొనసాగించిన షోయబ్‌ఉల్లాఖాన్ జన్మించిన పురిటిగడ్డ అయిన సుబ్లేడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయ్యాలని అన్నారు. ప్రస్తుతం మండల కేంద్రంగా ఉన్న తిరుమలాయపాలెం వెళ్లడానికి దూరప్రాంత గ్రామాల ప్రజలు దాదాపుగా 30 కిలోమీటర్లు ప్రయాణం చెయ్యడానికి రవాణా సదుపాయాలు లేకపోవడంతో దూర గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. దశాబ్దాల క్రితమే సుబ్లేడు గ్రామం పరిపాలన కేంద్రంగా అన్ని ప్రభుత్వ కార్యా లయాలు కల్గి అర్హతలు కల్గి ఎంతో చరిత్ర కలిగిన సుబ్లేడు గ్రామాన్ని మండలం చెయ్యడం ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మరింత చేరువుగా ప్రభుత్వ కార్యా లయాలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయి పరిపాలనా సౌలభ్యం అనుకూలంగా ఉంటుందన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి సుబ్లేడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు అచ్చ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్‌ఏల దీక్షలకు కామేపల్లి మండల కాంగ్రెస్ సంఘీభావం

## సమస్యలను సర్కారు సత్వరమే పరిష్కరించి చిత్తశుద్ధిని చాటుకోవాలి

## మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, జడ్పీటీసీ ప్రవీణ్‌నాయక్



*కామేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త:*

కామేపల్లి తాహశీల్దార్ కార్యాలయం ఎదుట గత 12రోజులు నుండి వీఆర్‌ఏలు నిర్వహిస్తున్న దీక్షకు మండల కాంగ్రెస్ పార్టీ శుక్రవారం సంఘీభావంను వ్యక్తం చేసింది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బానోతు వెంకటప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ....రాష్ట్ర వ్యాప్తంగా గత 12రోజుల నుండి పెద్దఎత్తున తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని దీక్ష చేస్తుంటే నేటి వరకు రెవిన్యూ మంత్రిగాని, ముఖ్యమంత్రిగాని వారిపట్ల కనికరం చూపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాలలో తరతరాల నుండి చాలీచాలని జీతాలతో రెవిన్యూ శాఖలో వెట్టి చాకిరి చేస్తున్నారని అన్నారు. తక్షణమే అసెంబ్లీలో చేసిన వాగ్దానం మేరకు ఉద్యోగ భద్రత, పే స్కేల్, 55 సంవత్సరాలైన వారికి వీఆర్‌ఎస్ కల్పించి వారి వారసులకు ఉద్యోగం కల్పించాలని, ఉన్నత విద్య కలిగిన వారికి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల అసెంబ్లీ ముట్టడి, ప్రగతి భవన్ ముట్టడికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి సత్య నారాయణ, ఎంపీటీసీ సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య, సర్పంచ్ మాలోత్ రామ్‌చందర్, బీసీ సెల్ మండల అధ్యక్షులు చల్ల మల్లయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాయబారపు కవిరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భూక్యా లాలునాయక్, జక్కంపూడి వెంకటేశ్వర్లు, కొర్ర రాములు, దీవెల రంగయ్య, ఉపసర్పంచ్ భూక్యా సునీతశ్రీరామ్, యువజన కాంగ్రెస్ నాయకులు నల్లమోతు వెంకటనర్సయ్య, అజ్మీరా శివ, మాలోత్ ప్రేమ్‌కుమార్, గండు సాగర్, ఎరుకుల రమేష్, తంగిళ్ళపల్లి తిరుపతయ్య పాల్గొన్నారు.

# మద్దులపల్లి ఐటిడిఏ శిక్షణ కేంద్రంలో డీడీని అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు

*ఖమ్మంరూరల్ ఆగస్టు 5 ప్రభాతవార్త*



ఖమ్మంరూరల్ మండల పరిధిలోని మద్దులపల్లి ఐటిడిఏ శిక్షణ కేంద్రంలో 150 మంది గిరిజన యువకులను తక్షణమే ఖాళీ చేయాలని అధికారుల ఆదేశాలకు వ్యతిరేకంగా మద్దులపల్లి ఐటిడిఏ శిక్షణా కేంద్రం వద్ద డిడి కృష్ణనాయక్‌ను యువజన కాంగ్రెస్ శ్రేణులు అడ్డగించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎంతో గొప్పలు చెప్పుకుంటూ ప్రభుత్వం విడుదల చేయబోయే నోటిఫికేషన్ కోసం గిరిజన యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తాం అని ఐటిడీఏ ద్వారా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ఈ కేంద్రాల్లో శిక్షణ ఇచ్చే ఫ్యాకల్టీలను నియమించనందున, సిలబస్ పూర్తికాక విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ సందర్భంలో ఏదో మమ అనిపించి విద్యార్థులను ఈ శిక్షణా కేంద్రం నుండి బయటకు పంపే ప్రయత్నం చేస్తున్న డీడీ కృష్ణ నాయక్‌ను అడ్డుకోవటం జరిగిందన్నారు. అక్టోబర్ 16వ తేదీ వరకు ఎటువంటి గ్రూప్‌సకు సంబంధించిన ఉద్యోగ నియామక పరీక్షలు లేకపోవడం వల్ల ఈ గిరిజన నిరుద్యోగ యువతకు అక్టోబర్ 16వ తేదీ వరకు ఇక్కడే ఉండి శిక్షణ పొందే అవకాశం కల్పించాలని డీడీని కోరారు. ఈ సందర్భంగా డీడీ అడ్డుకున్నారు. తదనంతరం పి.ఒ. పి.గౌతమ్‌తో మాట్లాడిన డిడి రేపటి వరకు సమయం ఇవ్వాలని, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తదనంతరం ఈ విషయంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించి గిరిజన యువతకు కనీసం గ్రూప్-1 ఉద్యోగ పరీక్ష అక్టోబర్ 16 వరకు అయినా శిక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈశిక్షణా కేంద్రంతో పాటు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని శిక్షణ కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు యువజన కాంగ్రెస్ పోరాడుతుందని అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోజెడ్ల రాహుల్, పాలేరు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లం మహేష్‌యాదవ్, ఖమ్మం అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొండూరి హృదయ్‌కిరణ్, తిరుమలాయపాలెం నాయకులు గుగులోతు సురేష్, నగేష్, ఖమ్మంరూరల్ మండల కోఆర్డినేటర్ కోటి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలి

## పీఆర్టీయు మండల అధ్యక్షులు గుడిపూడి శ్రీనివాస్‌రావు

*కామేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త:*

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని పిఆర్‌టియు కామేపల్లి మండల అధ్యక్షులు గుడిపూడి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఎన్నో ఏళ్ళుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లేకపోవడం వల్ల అదే రాములు, ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్. నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్శిటీ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

*ఎడ్యుకేషన్ కేయూ, ఆగస్టు 5, ప్రభాతవార్త:*

కేయూలోనెలకొన్న మౌళిక వసతుల సమస్యను తక్షణమే పరిష్కరించి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్‌చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థిసంఘం (పీడీఎస్‌యు) కేయూ కమిటీ ఆధ్వర్యంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.వెంకట్రామరెడ్డికి వినతిపత్రం అందచేశారు. శుక్రవారం కేయూలో జరిగిన కార్యక్రమంలో అలీ మాట్లాడుతూ యూనివర్శిటీలోనెలకొన్న అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. వర్షాకాలం ప్రారంభం వ్యాధులతో బాధపడుతున్నారని, తక్షణమే అన్నిహాస్టల్స్ లో హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థులందరికి మెడికల్ చెకప్‌లు చేసిసరైన మెడిసిన్ అందించాలని డిమాండ్‌చేశారు. కార్యరకమంలో పీడీఎస్‌యు కేయూ అధ్యక్షులు బి.గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, నాయకులు గణేష్, సాగర్, నవీన్, ప్రవీణ్, శశి పాల్గొన్నారు.




# సీజనల్ వ్యాధుల పట్ల తస్మాత్ జాగ్రత్త

## సర్పంచ్ అజ్మీరా రామదాసునాయక్, కార్యదర్శి పెండ్ర అనిల్‌కుమార్

*కామేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త:*



మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉంటుందని సర్పంచ్ అజ్మీరా రామదాసునాయక్, కార్యదర్శి పెండ్ర అనిల్‌కుమార్ అన్నారు. కామేపల్లి గ్రామ పంచాయితీలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంను శుక్రవారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం జరిగింది. స్దానికులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ నీరు ఆగి ఉన్న ప్రాంతాలలో తీమోఫస్, ఆయిల్ బాల్స్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ రజిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**- పంచాయితీ పాలకవర్గం సమావేశం:**

కామేపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ అజ్మీరా రాందాస్‌నాయక్ అధ్యక్షతన పంచాయితీ పాలకవర్గ సమావేశంను శుక్రవారం నిర్వహించారు. ఉప సర్పంచ్ అజ్మీరా అర్జున్, వార్డు సభ్యులు కన్నమాల వెంకన్న, రాయల లక్ష్మయ్య, రజిత, వాణి, కో ఆప్షన్ సభ్యులు శీలపాక ఇందిరా హాజరై, పలు అంశాలను చర్చించారు. పంచాయితీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని, పారిశుద్ధ్యంపై తగిన శ్రద్ద తీసుకోవాలని కార్యదర్శితో కలిసి వారు చర్చించారు. పంచాయితీ అభివృద్ధికి తమ సహకారం ఎప్పటికి అన్ని విధాలా ఉంటుందని పంచాయితీ సభ్యులు సూచించారు.

# ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలను పర్యవేక్షించిన అడిషనల్ కలెక్టర్

*కామేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త:*



కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామ పంచాయితీలో నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలను అడిషనల్ కలెక్టర్ స్నేహలత మొగిలి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. అదే విధంగా పల్లె ప్రకృతి వనాన్ని కూడా క్షేత్రస్దాయిలో పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, పచ్చ దనంను మరింతగా పెంపొందించాలని కోరారు. స్వచ్ఛ, హరిత, అభివృద్ధి పంచాయితీగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలవాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతను ప్రజలు పాటించాలని కోరారు. నీటి నిల్వలను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, ఎంపీవో జీవీఎస్, ఎపీవో ఏ. శ్రీరాణి, సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ, పంచాయితీ కార్యదర్శి బి.రవికుమార్, టీఏ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ప్రశాంతంగా ముగిసిన పీజీఈసెట్-2022 పరీక్షలు

*ఎడ్యుకేషన్ కేయూ, ఆగస్టు 5, ప్రభాతవార్త:*

తెలంగాణ రాష్ట్రంలో టీఎస్‌పీజీఈసెట్‌పరీక్ష ఈనెల 2న మొదలై 5వ తేదీ మార్నింగ్, ఈవినింగ్ షిఫ్టుల వారిగా నిర్వహించారు. 3006మంది విద్యార్థులను అలాట్‌మెంట్ చేయగా ఇందులో 2639మంది హాజరుకాగా, నిబంధనలను పాటిస్తూ పరీక్షలను విజయవంతంగా వరంగల్, నర్సంపేటలో నిర్వహించడం జరిగిందని డాక్టర్ సమ్మయ్య తెలిపారు.

# వైభవంగా వజ్రోత్సవ ద్విసప్తాహం దినోత్సవాలను నిర్వహించాలి

**- ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు సంబురాలు**

**- రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



*కొత్తగూడెం, ఆగస్టు 5 - ప్రభాతవార్త:*

ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న స్వాతంత్ర్య భారత వజ్రోత్సవ ద్వి సప్తాహం దినోత్సవాలను రంగరంగ వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేడుకల నిర్వహణపై కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రధాన కూడళ్లు విద్యుద్దీకరణ చేయాలని, మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మంత్రి చైర్మన్‌గా, కలెక్టర్ కన్వీనర్‌గా, జెడ్పీ చైర్మన్, ఎస్పీ, మున్సిపల్ చైర్మన్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో, డీఆర్‌డీవో, డీపీవో, మున్సిపల్ కమిషనర్లు, క్రీడల అధికారి, డీఈవో, డీపీఆర్‌వో, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ సభ్యులుగా ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్వాతంత్ర్య సాధనకు జరిగిన ఘట్టాలపై అవగాహన కల్పించాలని, ఈ వేడుకల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతీ ఒక్కరూ పెద్దఎత్తున పాల్గొనాలని సూచించారు. నూతన తరాలకు స్వాతంత్ర్యం కోసం జరిగిన అంశాలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఉపయోగించుకోవాలని చెప్పారు. 75 సంవత్సరాల వేడుకలు జరుపుకోవడం మనందరి అదృష్టమని ఆయన చెప్పారు. 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల షెడ్యూల్‌ను మంత్రి ప్రకటించి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 16వ తేదీన ఏకకాలంలో జాతీయ గీతాలాపన కార్యక్రమం ఉన్నందున మున్సిపల్, పంచాయతీ స్వచ్ఛ వాహనాలతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మున్సిపల్ ప్రధాన కూడళ్లలో డీజే సిస్టం ఏర్పాటు చేయాలని, ఏకకాలంలో జాతీయ గీతాలాపనకు ప్రభుత్వం సమయం నిర్దేశిస్తుందని, ఆ సమయంలో ఎక్కడివారు అక్కడే ఆగిపోయి జాతీయ గీతాన్ని ఆలపించి సెల్యూట్ చేయాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషదారణలతో చిన్నారులకు ఫ్యాషన్‌షో నిర్వహించాలని, ఐసీడీఎస్ అధికారులకు ఆదేశించారు. 9వ తేదీన ఇంటింటికి జాతీయ పతాకాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమం నిర్వహణకు డీఆర్‌డీవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారని అన్నారు. జాతీయ పతాకాలు పంపిణీలో జాగ్రత్తలు పాటించాలని, ప్రతీ ఇంటిమీద జాతీయ పతాకాలు ఎగరాలని అన్నారు. 279 మంది వీఆర్వోలకు జూనియర్ అసిస్టెంట్‌లుగా అవకాశం కల్పించామని, వారికి కేటాయించిన విధుల్లో అందరూ చేరడం పట్ల మంత్రి అభినందించారు.

**జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ**

జిల్లాలో దాదాపు 3.30 లక్షలపై చిలుకు గృహాలున్నాయని, ప్రతీ గృహానికి జాతీయ పతాకం అందించే విధంగా కార్యాచరణ తయారు చేసినట్లు చెప్పారు. 8వ తేదీన ప్రారంభ వేడుకలు కొత్తగూడెం క్లబ్‌లో వైభవంగా నిర్వహించనున్నామని, ఈ వేడుకలకు పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగం హాజరుకానున్నట్లు చెప్పారు. నాలుగు మున్సిపాలిటీలతో పాటు 23 మండలాల్లో 75 కనిపించే విధంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ వినీత్, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్లు కావు సీతాలక్ష్మీ, వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్**

*ప్రభాతవార్త ఖమ్మం ఆగస్టు 5*



వర్షాకాలం సీజనల్ వ్యాధుల కాలమని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ నియంత్రణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీజనల్ వ్యాధుల నియంత్రణకై మండల అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకై వైద్య, ఆరోగ్య శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్ని కార్యాలయాల్లో గురువారం డ్రైడే ఖచ్చితంగా పాటించాలని, పారిశుద్ధ్యం చర్యలతో పాటు నీరు వాడని సామాగ్రిలో, పాత టైర్లలో, ఎక్కడా నిలువా లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ఆయిల్‌బాల్స్ సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 2069 మంది ఫుడ్ క్యారియర్స్ నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా, 544 పాజిటివ్ కేసులు రాగా, వారికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. భారత స్వాతం త్ర్య వజ్రోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 8 నుండి 22 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా 17 రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు ఇందుకై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కేంద్రంలో 1000, నియోజకవర్గ కేంద్రాల్లో 250, మండల కేంద్రంలో 50, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30కి తక్కువ కాకుండా రక్తదాతలను గుర్తించాలన్నారు. అధికారులు, సిబ్బంది పెద్దఎత్తున రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలన్నారు. రక్తదాతల వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మొగిలి స్నేహలత, జిల్లా వైద్య ఆరోగ్యాధికారిని డాక్టర్ బి.మాలతి, జెడ్పీ సీఈవో అప్పారావు, డీఈవో యాదయ్య, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనతో వ్యవసాయ సంక్షోభం

**అమలు కాని స్వామినాథన్ సిఫారసులు**

**బోడేపూడి ఆశయాలు కొనసాగించాలి**

**బివికే ట్రస్ట్ చైర్మన్ తమ్మినేని**

*ప్రభాతవార్త ఖమ్మం ఆగస్టు 5*



మద్ధతు ధరలు, ఎరువుల సబ్సిడీ, సంక్షేమ పూరిత వ్యవసా యం, స్వామినాథన్ కమిటీ సిఫారసుల అమలు.. రకరకాల హామీలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం 2014 నుంచి రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్త వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టిందని అఖిలభారత రైతు సంఘం సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్, బివికే ట్రస్ట్ ఛైర్మన్ తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు 25వ వర్ధంతి సందర్భంగా బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మంచికంటి మీటింగ్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ రంగం.. వర్తమానం... భవిష్యత్తు... ప్రజలపై ప్రభావం అనే అంశంపై ప్రసంగించారు. 1992 నుండి మొదలైన సరళీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు నిర్వహించిందన్నారు. నాడు ఆ విధానాల దుష్ప్రభావం ప్రజలపై నేటికీ ఉందన్నారు. ఈ 20 ఏళ్లలో 20 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. 2014-22 వరకు రైతులు మరింత సంక్షోభవంలో కూరుకుపోయారన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ అని చెబుతున్న మోడీ ప్రభుత్వం ఆహారభద్రత కూడా ఇవ్వలేకపోతుందన్నారు. సిద్ధాంతాన్ని సరళ భాషలో చెప్పటం బోడేపూడి ప్రత్యేకత అన్నారు. మంచి కమ్యూనిస్టు అంటే బోడేపూడిలా ఉండాలన్నారు. బోడేపూడి ఆశయాలు కొనసాగించేందుకు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, బీవీకే ట్రస్టు కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ సదస్సులో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, బండి రమేష్, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, వై.విక్రమ్, నాయకులు కాసాని ఐలయ్య, మల్లెంపాటి వీరభద్రం, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్యాన్ని పాటించాలి

**జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్**

*రఘునాథపాలెం ఆగస్టు 5 ప్రభాతవార్త*



డెంగ్యూ, సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఇంట్లో పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకొని పారిశుద్ధ్యాన్ని పాటించాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్‌లో శుక్రవారం ఆయన ఇంటింటికి వెళ్లి డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నియంత్రణకై చేపట్టాల్సిన చర్యలు గురించి చైతన్యం కల్పించారు. స్లాబ్‌లపై వారానికి ఒకసారి తనిఖీలు చేసుకోవాలని నీటి నిల్వలు ఉంటే వెంటనే తొలగించాలని తెలిపారు. ఫీవర్ సర్వే రెగ్యులర్‌గా చేపట్టాలని, వారానికి ఒకరోజు ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాట చేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు స్లాబులు తదితర ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. డబుల్‌బెడ్‌రూ మ్ ఇండ్ల సము దాయాల్లో కేటాయించిన వారే నివాసముంటున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల సముదాయంలో కాక గ్రామంలో జనాభా గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ బి.మాలతి, డిఎంఒ డాక్టర్ సంధ్య, ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ నర్సింహారావు, వైద్యాధకారిని డాక్టర్ స్రవంతి, గ్రామసర్పంచ్ కె.లలిత తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# డబ్ల్యూ.ఎల్.రేగుబల్లిలో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త:*

శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని డబ్ల్యూ.ఎల్.రేగుబల్లి గ్రామంలో కృష్ణాలయంలో వరలక్ష్మి వ్రతాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. పాండవకృష్ణ భజన మండలి అధ్యక్షుడు జెట్టి వెంకటరాజు ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి పూజ మహిమల గురించి భక్తులకు వివరించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్ధప్రసాదాలు స్వీకరించారు. అత్యంత వైభవంగా జరిగిన పాండవ కృష్ణ భజన మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా వరలక్ష్మి పూజా వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాణి, వనజ, సావిత్రి, నాగేశ్వరి, రత్నకుమారి, భద్రకేళీ, రవళి, రోజా, ప్రశాంతి, రాధ, జయమ్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.



**-దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

వరలక్ష్మి వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న శ్రీదాసాంజనేయ స్వామి వారి ఆలయంలో వెలసి ఉన్న శ్రీకనకదుర్గాదేవీ ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆరుట్ల రాజాగోపాలాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, పాలు, పెరుగుతో పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించారు. సౌభగ్యానికి సకల భోగభాగ్యాలకు, అష్ట ఐశ్వర్యాలకు లక్ష్మీకటాక్షం పొందడానికి ఉత్తమమైన వ్రతం వరలక్ష్మి వ్రతమని అర్చకుడు భక్తులకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో మహిళలు అమ్మవారికి దేవీస్తుతి, దేవీ ఖడ్గమాల, లలితా సహస్రనామం, కనకదార స్త్రోత్రాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీరపు వీరరాఘవరెడ్డి, టిటిడి హెచ్‌డిపీపీ పిలకా నాగేందర్‌రెడ్డి, బత్తులు శ్యామల, అనురాధ, రమణమ్మ, నరేందర్‌రెడ్డి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.